

రైల్వే స్టేషన్‌లో రద్దీ

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 17 జనవరి 2025



రైళ్లు ఫుల్

సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చినవారు తిరుగు ప్రయాణం


రత్నాచల్ రైలు వద్ద ప్రయాణికులు

- సికింద్రాబాద్, బెంగళూరు, చైన్నై రైళ్లకు డిమాండ్
- ఈ నెల 26 వరకూ బెర్తులు రిజర్వు
- హౌరా రైళ్లకు నెలాఖరు వరకూ డిమాండ్

విశాఖపట్నం, జనవరి 16:

సంక్రాంతికి సొంత ఊళ్లకు వచ్చినవారు తిరిగి తాము ఉంటున్న పట్టణాలు, నగరాలకు ప్రయాణం కావడంతో గురువారం రైళ్లు కిక్కిరిశాయి. సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే రైళ్లు రద్దీగా కనిపించాయి. ఖరారు బెర్తు/సీటు లేని వారు జనరల్ కోచ్‌లను ఆశ్రయించేందుకు రైలు బయలుదేరే నిర్ణీత సమయానికి గంట ముందుగానే స్టేషన్‌కు చేరడంతో ప్లాట్‌ఫామ్‌లు కిటకిటలాడాయి. రాజమండ్రి, విజయవాడ, గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేవారు జన్మభూమి (12805), సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), మధ్యాహ్నం రత్నాచల్ (12717), మెయిల్ (12839), ప్రశాంతి (18463), తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను ఆశ్రయించారు.

సికింద్రాబాద్ రైళ్లకు డిమాండ్

పండుగ తిరుగు ప్రయాణికులతో విశాఖ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే గోదావరి (12727), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), ఎల్‌టీటీ (18519), విశాఖ-నాందేడ్ (20811), గరీబ్‌రథ్ (12739), జన్మభూమి (12805), కాచీగూడ (18561) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ (17015), కోణార్క్ (11020), ఫలక్‌నూమా (12703), సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809)లు రద్దీగా నడిచాయి. ఈ రైళ్లలో ఈనెల 26వ తేదీ వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. వందేభారత్ (20708), (20833) రైళ్లకు మాత్రం ఈనెల 21 నుంచి, దురంతో ఎక్స్‌ప్రెస్ (22203)కు ఈ నెల 23 నుంచి బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై రైళ్లకు రద్దీ...ఫిబ్రవరి 24 వరకు ఫుల్

చెన్నై వెళ్లే రైళ్లలో బెర్తులు ఫిబ్రవరి 24 వరకూ రిజర్వు అయిపోయాయి. మెయిల్ (12839), బొకారో (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లకు ఫిబ్రవరి 24 వరకు బెర్తు లభించే పరిస్థితి లేదు. అయితే చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12841)కు ఈనెల 31వ తేదీ నుంచి బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

ఫిబ్రవరి 24 వరకు బెంగళూరు రైళ్లు ఫుల్

బెంగళూరు వెళ్లే ప్రశాంతి (18463), హౌరా-యశ్వంతపూర్ (12863), గువహటి-బెంగళూరు (12510) వంటి రెగ్యులర్ రైళ్లలో బెర్తులు ఫిబ్రవరి 24 వరకూ రిజర్వు అయిపోయాయి. భువనేశ్వర్-బెంగళూరు (12845), హటియా-బెంగళూరు (18637), న్యూ టిన్సుకియా-బెంగుళూరు (22502), హటియా-బెంగళూరు (12835), ... మిగతా 6వ పేజీలో

తెగ తాగారు

- సంక్రాంతికి రూ.24 కోట్ల విలువైన మద్యం అమ్మకం
- సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు...
- భీమిలి, పెందుర్తి, గాజువాక సర్కిళ్లలో అధికం
- నగరంలో తగ్గిన విక్రయాలు



విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండుగ మద్యం వ్యాపారులకు మంచి కిక్ ఇచ్చింది. భోగి, సంక్రాంతి, కనుమ...మూడు రోజుల్లో ఏకంగా రూ.24 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. జిల్లాలో (జీవీఎంసీలో కలిసి ఉన్న అనకాపల్లి పట్టణంలోని ఐదు వార్డుల్లో 12 దుకాణాలను మినహాయించి) 145 మద్యం దుకాణాలు ఉండగా, 119 బార్‌లు ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి ప్రతిరోజూ సగటున రూ.నాలుగైదు కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. కానీ సంక్రాంతి సందర్భంగా మందుబాబులు రెట్టింపు మద్యం సేవించారు. 13న భోగి పండుగ రోజు రూ.ఏడు కోట్లు మద్యం అమ్ముడైంది. 14న సంక్రాంతి రోజు రూ.ఎనిమిది కోట్లు, 15న కనుమ రోజున రూ.తొమ్మిది కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అయితే నగర నడిబొడ్డున ఉన్న దుకాణాల్లో విక్రయాలు గణనీయంగా తగ్గగా, శివారుప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో మాత్రం భారీగా పెరిగాయి.

నగరంలో నివాసం ఉంటున్న వారిలో అత్యధికులు సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లడంతో సీతమ్మధార, మహారాణిపేట, మద్దిలపాలెం సర్కిళ్లలోని దుకాణాల్లో మద్యం విక్రయాలు తగ్గాయి. అదే సమయంలో ... మిగతా 6వ పేజీలో

చినుకు రాలినా...ప్చ్!

నగరంలో ఆశాజనకంగా లేని భూగర్భ జలాలు

- జనావాసాలు పెరిగిన చోట తగ్గుదల
- రీచార్జి చేయకుంటే మూల్యం చెల్లించాల్సిందేనంటున్న నిపుణులు
- గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పెరుగుదల

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

శీతాకాలంలో వర్షాలు కురిసినా భూగర్భ జల మట్టాలు కొన్ని ప్రాంతాల్లో అంతా ఆశాజనకంగా లేవు. సాధారణంగా వేసవి సీజన్‌లో భూగర్భ జల మట్టాలు తక్కువగా ఉంటాయి. కానీ ఈసారి వర్షాకాలంలో కొన్నిచోట్ల ఆందోళనకర స్థాయికి పడిపోయాయి. అయితే డిసెంబరులో అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలు కొంతవరకు భూగర్భ జలాల పెరుగుదలకు ఉపయోగపడ్డాయి. జూన్‌లో మొదలైన వర్షాకాలం ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకూ కొనసాగడంతో కొంతవరకూ ఊపిరి పీల్చుకునే అవకాశం ఏర్పడిందని భూగర్భ జల నిపుణులు విశ్లేషిస్తున్నారు. డిసెంబరు నెలలో ముసురు లేకపోతే నగరంలో కొన్నిచోట్ల మరింత దారుణ పరిస్థితి నెలకొనేదని విశ్లేషించారు. అయితే జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి మాత్రం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో 2022, 2023తో పోల్చితే 2024 డిసెంబరులో భూగర్భ జలమట్టాలు మెరుగ్గా ఉన్నాయి. గత ఏడాది నైరుతి రుతుపవనాలు, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో వర్షాలు బాగానే కురిశాయి. అయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో నవంబరు నెలలో అడపాదడపా వర్షాలు కురుస్తుండేవి. కానీ ఈ ఏడాది డిసెంబరులో ఫెంగల్ తుఫాన్, తరువాత అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు పడ్డాయి. భూమిలోకి వర్షపునీరు ఇంకేలా జల్లులు కురవడం మేలు చేసింది. గత మూడేళ్లలో డిసెంబరు నెలలో భూగర్భ జల మట్టాలు పరిశీలిస్తే 2024లో జిల్లాలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో భూగర్భ జల మట్టాలు పెరగడం లేదా స్థిరంగా కొనసాగడం జరిగింది. నగరంలో అనేకచోట్ల డిసెంబరు ... మిగతా 6వ పేజీలో


నీరు కాస్త లోతులో ఉన్న ఆనందపురం మండలం గొట్టిపల్లిలోని బావి

మండలాల వారీగా సగటు భూగర్భ జల మట్టాలు

మండలం	బావి ఉండే ప్రాంతం	2022 (మీటర్లలో)	2023	2024
ఆనందపురం	పందులపాక	3.26	6.25	4.95
భీమిలి	ఏపీ గురుకులం	2.21	3.26	3.54
గాజువాక	అగనంపూడి పాఠశాల	5.53	6.84	6.35
ములగాడ	గొల్లలపాలెం హెల్త్ సెంటర్	4.74	6.75	4.88
గోపాలపట్నం	ఏపీఐడీసీ ఆఫీస్	3.62	5.95	3.32
పద్మనాభం	అనంతవరం	4.21	5.24	4.69
పెదగంట్యాడ	పాలవలస హిందూజా ప్లాంట్	2.82	5.24	4.69
పెందుర్తి	నరవ	4.18	4.6	4.22
సీతమ్మధార	ఏపీటీడీసీ	5.44	6.53	4.47
మహారాణిపేట	యోగా విలేజ్	10.06	10.28	9.86
విశాఖ రూరల్	రుషికొండ స్కూలు	10.01	13.51	10.57

ఉక్కులో వీఆర్‌ఎస్‌కు 370 దరఖాస్తులు

- కేంద్రం సాయం ప్రకటన నేపథ్యంలో వెనక్కి తగ్గే అవకాశం?


విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):



విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ పథకానికి (వీఆర్‌ఎస్) అనూహ్యమైన స్పందన కనిపిస్తోంది. వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి అవకాశం కల్పించారు. ఈ రెండు రోజుల్లోనే మొత్తం 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 196 మంది కాగా 174 మంది ఎగ్జిక్యూటివ్ కేడర్‌కు చెందినవారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం, ప్లాంటులో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగకపోవడంతో ఉద్యోగులకు సంస్థపై నమ్మకం తగ్గిపోయింది. ఇక్కడ వీఆర్‌ఎస్ తీసుకొని, వేరే సంస్థకు వెళ్లి పని చేసుకోవచ్చుననే ఉద్దేశంలో కొందరు ఉన్నారు. అయితే ఊహించని విధంగా కేంద్ర ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయం ప్రకటించింది. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.17 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇవ్వనున్నట్టు వెల్లడించింది. ఈ సాయం ఎలా ఉంటుందనే దానిపై శుక్రవారం పూర్తి వివరాలు తెలుస్తాయి. ఆ తరువాత కూడా వీఆర్‌ఎస్‌కు ఉద్యోగులు మొగ్గు చూపుతారా? లేదంటే సంస్థపై విశ్వాసంతో ఇక్కడే ఉండడానికి ఇష్టపడతారా? అనేది నెలాఖరుకు తేలుతుంది. తొలి విడతలో వీఆర్‌ఎస్‌ద్వారా వేయి మందిని ఇంటికి పంపాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రం సాయం చేస్తున్న నేపథ్యంలో ఎంతమంది ముందుకు వస్తారో చూడాల్సి ఉంది.

రహదారుల నిర్మాణంపై కసరత్తు

'సెల్ఫ్ సస్టెయినబుల్ మోడల్'లో చేపట్టాలని భావిస్తున్న వీఎంఆర్‌డీఏ



- వెచ్చించిన మొత్తం తిరిగి ఆదాయం రూపంలో వెనక్కి తెచ్చుకునేలా ప్రణాళికలు
- ఆర్‌డీపీ తయారయ్యాకే పనులు
- ఆచరణకు ప్రత్యేకంగా హైపవర్ కమిటీ నియామకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ జిల్లాలో పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 'సెల్ఫ్ సస్టెయినబుల్' రహదారుల నిర్మాణానికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది. ముఖ్యంగా ఇంకో 18 నెలల కాలంలో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తున్నందున జిల్లా నలుమూలల నుంచి అక్కడకు త్వరగా చేరుకోవడానికి జీవీఎంసీతో కలిసి 15 రహదారుల నిర్మాణానికి నిర్ణయించింది. జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గించడమే వీటి నిర్మాణంలో ప్రధాన ఉద్దేశం. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని కలుపుతూ కొన్ని, భీమిలి బీచ్‌ను కలుపుతూ కొన్ని, ఎన్‌ఏడీ నుంచే దారిమళ్లించేలా మరికొన్ని రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు.

పెందుర్తి, ఆనందపురం, భీమిలి, డెంకాడ, విజయనగరం తదితర ప్రాంతాలను కలుపుతూ విస్తరించే ఈ 15 రహదారులకు రూ.403.67 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఒక్కో రహదారి నిర్మాణానికి సగటున రూ.25 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. అయితే ఇటు వీఎంఆర్‌డీఏ వద్ద గానీ, అటు జీవీఎంసీ దగ్గర గానీ అన్ని నిధులు లేవు. దాంతో రహదారులకు వెచ్చించిన మొత్తం తిరిగి ఆదాయం రూపంలో వెనక్కి తెచ్చుకునేలా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. టోల్ గేట్ పెడితే సరిపోతుందా?, ఇంకా ఇతర ఆదాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా?, ప్రజలకు ఇబ్బంది లేకుండా, ఆర్థిక భారం పడకుండా చూడడం ఎలా?...అనే దానిపై కసరత్తు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేకంగా కమిటీని కూడా నియమించారు. హైదరాబాద్‌లో అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులో పనిచేసి రిటైరైన డీటీసీపీని, రాష్ట్ర డీటీసీపీని, వీఎంఆర్‌డీఏ సీయూపీ, ఏయూకు చెందిన ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి ... మిగతా 6వ పేజీలో

నేడు హైపవర్ కమిటీ సమావేశం

– విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ



భోగాపురం కనెక్టివిటీ కోసం నిర్మించే రహదారులను 'సెల్ఫ్ సస్టెయినబుల్' మోడల్‌లో నిర్మించడానికి హై పవర్ కమిటీ వేశాం. ఇంతకు ముందు ప్రాథమికంగా ఒక సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. వీఎంఆర్‌డీఏలోనే శుక్రవారం మరో సమావేశం నిర్వహిస్తున్నాం. ఇందులో ఆదాయ వనరులు ఎలా?...అనే అంశంపై చర్చించి అందరి ఆలోచనలతో ఒక ఆర్‌డీపీ తయారు చేస్తాం. దానిని అమలు చేసి, విజయవంతం అయితే అదే తరహాలో మిగిలిన రహదారుల నిర్మాణం చేపడతాము.

సీపీ ఆదేశాలు బేఖాతరు!

- గత నెల 23న 93 మంది పోలీస్ సిబ్బంది బదిలీ
- జాబితాలో ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు
- రిలీవ్ అయ్యి...తమకు కేటాయించిన స్టేషన్‌లో చేరింది 10 మంది లోపే
- మిగిలిన వారంతా పాత స్టేషన్లలోనే విధులు



విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్‌లో వింత పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న 93 మంది సిబ్బందిని గత నెల 23న వేరే స్టేషన్‌కు బదిలీ చేశారు. వారిలో 15 మంది ఏఎస్‌ఐలు, 43 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 35 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరంతా ఒకటి, రెండు రోజుల్లోనే తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రిపోర్టు చేయాలి. కానీ బదిలీ అయిన వారిలో 90 శాతం మంది పాత పోలీస్ స్టేషన్లలోనే కొనసాగుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీపీ బదిలీ చేసిన 93 మందిలో పది మందిలోపు మాత్రమే తమకు కేటాయించిన స్టేషన్‌కు వెళ్లి రిపోర్టు చేశారు. మిగిలిన వారంతా ఎందుకు కదలడం లేదనే చర్చ జరుగుతోంది. పాత పోలీస్ స్టేషన్లలో వసూళ్లకు, మొక్కుబడి విధి నిర్వహణకు అలవాటుపడడం వల్లే బదిలీ చేసినప్పటికీ కొత్త స్టేషన్‌కు వెళ్లడానికి విముఖత వ్యక్తంచేస్తున్నారని కొందరు అధికారులు చెబుతున్నారు. అయితే పోలీస్ హౌస్ ఆఫీసర్లే తమ స్టేషన్ నుంచి బదిలీ అయిన వారిని రిలీవ్ చేయడం లేదని, వారి స్థానంలో కొత్తగా పోస్టింగ్ ఇచ్చినవారు చేరకపోతే స్టేషన్‌లో ఇబ్బంది ఏర్పడుతుందని ఆలోచిస్తున్నారని మరికొందరు చెబుతున్నారు. బదిలీ అయినా పాత స్టేషన్‌లోనే కొనసాగుతున్నవారి వద్ద ఈ విషయాన్ని ప్రస్తావిస్తే తమను రిలీవ్ చేయాల్సిందిగా తమ ఎస్‌హెచ్‌ఓలను వేడుకుంటున్నామని, కానీ వారు మాత్రం ఎందుకో స్పందించడం లేదని, అన్ని స్టేషన్లలోనూ ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇదిలావుండగా ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్ గత ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారని, ఆయన్ను మాత్రం సీపీ బదిలీ చేయలేదని అంటున్నారు. సదరు హెడ్ కానిస్టేబుల్ వసూళ్ల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తుండడం వల్లే స్టేషన్ అధికారులు ఆయన్ను బదిలీ నుంచి తప్పించేలా ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించారని ఆరోపిస్తున్నారు. దీనిపై సీపీ దృష్టిసారించాలని కోరుతున్నారు.

పక్కాగా భూముల రీసర్వే

పైలట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాలు ఎంపిక

- ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు
- ఏప్రిల్‌కల్లా జిల్లాలో రీసర్వే పూర్తి
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- అర్జీలకు పరిష్కారంపై ఆడిట్ టీమ్



విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో భూముల రీసర్వే కోసం పైలట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాలకు ఎంపిక చేసినట్టు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ వెల్లడించారు. గురువారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 60 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మరో 20 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉందన్నారు. అయితే గతంలో వచ్చిన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని 20 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పక్కాగా చేపట్టాలని నిర్ణయించామన్నారు. తొలుత ఆనందపురం మండలం గొట్టిపల్లి, భీమిలి మండలం దాకమర్రి, పద్మనాభం మండలం గంధవరం గ్రామాల్లో రీసర్వేకు ఇద్దరేసి సర్వేయర్లు, వీఆర్‌వో, వీఆర్‌ఐతో బృందాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రతి 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా గుర్తించి ఈ టీమ్‌లు సర్వే చేపడతాయన్నారు. జిల్లాలో రీసర్వే పనులు వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలని నిర్ణయించామని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని క్షేత్రస్థాయి ... మిగతా 6వ పేజీలో

ఆరోగ్య శాఖలో ఇ-పాలన

- ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల చర్యలు
- ప్రక్రియ ప్రారంభించాలని సూచించిన డీఎంహెచ్‌వో
- కేజీహెచ్, విమ్స్ సహా బోధనాస్పత్రుల్లోనూ అమలు



విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ కార్యాలయాల్లో పేపర్ రహిత పాలన దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇ-పాలన అమలుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై ఉన్నతాధికారులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కీలక సూచనలిచ్చారు. రానున్న పది రోజుల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

కేజీహెచ్, విమ్స్ సహా బోధనాస్పత్రుల్లో ఇ-పాలన అమలుకు రంగం సిద్ధమవుతోంది. దీనిపై ఇప్పటికే డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేయడంతోపాటు ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని బోధనాస్పత్రుల్లో ఇ-పాలన అమలు దిశగా కేజీహెచ్ సూపరింటెండెంట్ చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అనేక విభాగాల్లో కొద్ది నెలలుగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటికి చెక్ చెప్పేందుకు ఇ-పాలన అమలు అవసరమని భావిస్తున్నారు. ప్రతి ఫైల్‌కు ఒక నంబరు ఇచ్చి, ఈ-ఆఫీస్‌లోనే ప్రతి ... మిగతా 6వ పేజీలో

ఆభరణాల మాయంపై విచారణలో జాప్యం

సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి దాతలు విరాళంగా ఇచ్చిన ఆభరణాలు మాయమైనట్టు వచ్చిన ఫిర్యాదుపై విచారణలో ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారు. స్వామివారికి దాతలు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాల విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని కడప జిల్లాకు చెందిన కె. ప్రభాకరాచారి దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు గత ఏడాది నవంబరులో ఫిర్యాదు చేశారు. ఆభరణాల్లో కొన్ని మాయమయ్యాయని, మరికొన్నింటి రికార్డులు కనిపించడం లేదని చెప్పారు. దీనిపై ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ స్పందిస్తూ కాకినాడ రీజినల్ జాయింట్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించి, వారం రోజుల్లో బాధ్యులపై చర్యలకు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు విచారణలో కనీస కదలిక లేకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై విచారణాధికారి, కాకినాడ ఆర్‌జేసీ సుబ్బారావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా త్వరలోనే ఆలయానికి వచ్చి విచారణ చేస్తామని చెప్పారు.

కనుమరుగవుతున్న కర్రలతో నడిచే కళాకారులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పండగల సమయంలో ఇంటింటికి కర్రలు తగిలించుకుని నడిచే కళాకారుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది. మండలంలో ఇటువంటి కళాకారులు ఎంతోమంది ఉండేవారు. ప్రస్తుతం ఒకటి రెండు గ్రామాల్లో మాత్రమే ఉన్నారు. వారు కాళ్లకు కర్రలు తగిలించుకుని నడుస్తూ ఇంటింటికి వెళుతుంటారు. వారిని తీసుకువచ్చిన వారు డప్పులు, తప్పెటగుళ్లు వాయిస్తూ ముందు నడుస్తుంటారు. వీధుల్లో వారి నడకను ప్రజలు ఎంతో ఆసక్తిగా చూస్తుంటారు. కర్రలు తగిలించుకున్నారన్న విషయం తెలియకుండా పొడవైన కాళ్లకు అందుకు తగిన విధంగా ఫేంట్లు కుట్టించుకుని ధరిస్తుంటారు.వారు ఇళ్ల వద్దకు రాగానే డబ్బులు, కానీ బియ్యం కాని ఇవ్వడం ఆనవాయితీ. సంక్రాంతి నేపథ్యంలో నగరపాలెం, పాతపాలెం, అల్లుపేట, ముద్దాడపేట గ్రామాల్లో కొన్నేళ్ల తరువాత వారి సందడి కనిపించింది.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు

సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని గురువారం యూరోప్ దేశానికి పర్యాటకులు దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వారు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకుని పులిహోర ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింహగిరి అందాలను తమ కెమెరాలో బంధించారు.

కలగానే శాఖా గ్రంథాలయం ఏర్పాటు

- 20 ఏళ్లుగా పోరాడుతున్న స్థానికులు
- దృష్టిసారించని పాలకులు,అధికారులు
- పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో లేక నిరుద్యోగ యువత అవస్థలు


జడ్పీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు (ఫైల్‌ఫొటో)

మధురవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నాయి..పాలకులు మారుతున్నారు.. గ్రంథాలయ పోరాట యోధులు కొందరు మృతి చెందారు. 20 ఏళ్లు అయినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు. సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న మధురవాడలో శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఇరవై ఏళ్లుగా స్థానికులు పోరాడుతున్నారు. ఇంతవరకు ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు కాలేదు. మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం పెద్ద ఉద్యమమే చేశారు. మల్లువలస జగదీశ్వరరావు, నాగోతి సింగన్న, పోతిన వరం, తదితరులు శాఖా గ్రంథాలయం కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నో వినతులు ఇచ్చారు. ప్రస్తుతం వారు ముగ్గురూ మృతి చెందారు. ఆ తరువాత అఖిలపక్షం ఆధ్వర్యంలో ఐదేళ్ల కిందట మధురవాడ జీవీఎంసీ కార్యాలయం ముందు 24 గంటలు నిరాహార దీక్ష చేపట్టారు. అంతలా పోరాడినా ఫలితం దక్కలేదు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో వందలాది మంది నిరుద్యోగ యువత ఉన్నారు. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు కూడా వందల సంఖ్యలో ఉన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం లేకపోవడంతో కొందరు నగరంలోని గ్రంథాలయాలకు వెళుతున్నారు. మరికొందరు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. నిరుద్యోగ యువతకు అన్ని జర్నల్స్, దినపత్రికలు, రిఫరెన్స్ బుక్స్ కొనే ఆర్థిక స్థోమత లేదు. గ్రంథాలయం ఉంటే పుస్తకాలన్నీ అందుబాటులో ఉంటాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయం కోసం మళ్లీ సుదీర్ఘ పోరాటం చేయడానికి స్థానికులు సిద్ధమవుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతాం



స్థానికుల కోరిక మేరకు మధురవాడలో శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళతాం. ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం.

పిళ్లా వెంకటరావు, టీడీపీ నాయకుడు

పౌర సంక్షేమ సంఘం పోరాటం



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడలో శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. ఇందు కోసం మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నాం. ఈ ఉద్యమానికి అందరూ సహకరించాలి.

నాగోతి సూర్యప్రకాశరావు
పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు

పంట పొలాల్లో కొంగల దండు


తాటితూరు పొలాల్లో గుంపుగా ఉన్న కొంగలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని తాటితూరు, నగరపాలెం, మజ్జిపేట, మజ్జివలస ప్రాంతాల్లో కొంగల గుంపు సందడి చేస్తోంది. ఈ గ్రామాల్లో నీరు అధికంగా ఉండడంతో కొంగలకు ఆహారం సమృద్ధిగా లభిస్తోంది. దీంతో ఎక్కడెక్కడి నుంచో పదుల సంఖ్యలో గుంపులుగా ఇక్కడికి చేరుతున్నాయి. కాగా కొంగలు రైతులు వేసిన పంటల గింజలను నాశనం చేస్తున్నాయి. వాటి వల్ల ఏటా పంటల దిగుబడి తగ్గిపోతోందని, గింజలు పాడైపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రాజాధిరాజా అలంకరణలో అప్పన్న



సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు గురువారం రాజాధిరాజా అలంకరణలో దర్శనమిచ్చారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం రాజభోగం, పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాలుపై కాలు వేసుకున్న రాజాధిరాజుగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. మరొక పల్లకిలో విశిష్టాద్వైత మత ప్రచారకులు భగవద్రామానుజాచార్యులు, మనవాళ్ల మహామునులు, నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్లను ఉంచారు. ఆలయ అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను అనుసంధానం చేయగా, పండితులు చతుర్వేదాల పారాయణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు, కళాకారుల కోలాటాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు.

'నైతిక విలువలు చంద్రబాబు సొంతం'

భీమునిపట్నం,జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ, భావితరాలకు ఆదర్శ నాయకుడిగా చంద్రబాబు నిలుస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుపై గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన స్కిల్ కేసు బెయిల్ పిటిషన్‌కి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆ పార్టీ నాయకులకు చెంపపెట్టన్నారు.

పూర్తిగా వెలగని డిజిటల్ బోర్డు

సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో జరిగే నిత్య ఆరాధనలు, ఆర్జిత సేవలను భక్తులకు తెలియజేస్తూ యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో సిం హగిరిపై ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులు సక్రమంగా పనిచేయడం లేదు. ముఖ్యంగా పీఆర్‌ఓ కార్యాలయం ముందున్న బోర్డు సగం మాత్రమే వెలుగుతోంది. దీంతో భక్తులకు పూర్తి సమాచారం తెలియకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి డిజిటల్ బోర్డును సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

'ఐటీతో విశాఖను ఆదుకోండి'

మంత్రి లోకేశ్‌కు గంటా రవితేజ అభ్యర్థన


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవితేజ

భీమునిపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దుతున్న విశాఖకు ఐటీలో కూడా ఉజ్వల భవిష్యత్ అందించడానికి శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ యువనేత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ కోరారు. గురువారం ఆయన నారా వారి పల్లెలో లోకేశ్‌ను కలిసారు. ఈ సందర్భంగా టీసీఎస్ సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేశ్ కృషిని అభినందించారు. ఐటీ హబ్‌గా విశాఖకు మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు. అలాగే కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, ముఖ్యంగా యువతకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

చినుకు రాలినా...ఫ్చ్!

... 5వ పేజీ తరువాయి

నెలాఖరుకు 10 మీటర్లు, అంతకంటే తక్కువకు పడిపోవడం, కొన్నిచోట్ల పెరుగుదల కనిపించింది. నగరంలో విచ్చలవిడిగా భూగర్భ జలాల వినియోగం సాగడంతో వచ్చే వేసవిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరించారు.

గ్రామీణంలో పెరుగుదల

ఆనందపురం మండలం శొంఠ్యాంలో డిసెంబరుకు సంబంధించి 2022లో 8.09 మీటర్లున్న భూగర్భ జల మట్టాలు 2023లో 5.1 మీటర్లు, ఈ ఏడాది 4.21 మీటర్లుగా నమోదయ్యాయి. భీమిలి మండలం చిప్పాడలో 2022లో 5.13 మీటర్లుండగా, ఈ ఏడాది 1.99, పెందుర్తి మండలం నరవలో 2022లో 5.13 మీటర్లు, ప్రస్తుతం 1.25, ఎంపీడీవో కార్యాలయం వద్ద 8.09 మీటర్లుండగా ప్రస్తుతం 7.19 మీటర్లలో ఉన్నాయి. కాగా గ్రామీణ ప్రాంతంలో జనావాసాలు ఎక్కువగా ఉన్నచోట, అభివృద్ధి జరిగే ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. భీమిలిలో ఏపీ గురుకులం వద్ద 2022లో 5.13 మీటర్లు ఉండగా ప్రస్తుతం 7.39 మీటర్లకు పడిపోయింది. నగరంలో అనేక చోట్ల డిసెంబరులో భారీగా జలమట్టాలు పడిపోయాయి. గాజువాక కణితి కాలనీలో 2022లో 4.56 మీటర్లుండగా గత ఏడాది 10.27కు, ప్రస్తుతం 11.23 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద 2022లో 5.13 మీటర్లున్న భూగర్భ మట్టాలు గత ఏడాది 14.22కు, ఈ నెలలో 12.65కు, మారికవలస బిస్లరీ యూనిట్ వద్ద వరుసగా 5.13, 10.44, 9.45, మధురవాడ ఆస్పత్రి వద్ద 2022లో 5.23 ఉండగా, గత ఏడాది 13.73, ప్రస్తుతం 11.89 మీటర్లకు పడిపోయింది. నగరంలో సెంట్రల్ పార్కు వద్ద 2022లో 3.76 మీటర్లు ఉండగా, 2023లో 13.63, ప్రస్తుతం 13 మీటర్లు, ఏయూ యోగా విలేజ్ వద్ద 6.36, 6.93, 6.72 మీటర్లుగా ఉన్నాయి. బీవీకే కళాశాల దగ్గర 2022లో 5.23 మీటర్లున్న జల మట్టాలు 2023లో 4.27, ప్రస్తుతం 2.48 మీటర్లు, గోపాలపట్నం రైతుబజారు వద్ద 4.56, 6.23, 2.36 మీటర్లలో ఉన్నాయి.

నీటి రీచార్జి విధానం పెరగాలి

- శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జల శాఖ

ఇటీవల కురిసిన వర్షాలతో కొన్నిచోట్ల భూగర్భ జలాలు పెరిగాయి. మరికొన్నిచోట్ల స్థిరంగా ఉన్నాయి. డిసెంబరు నెలలో రోజుల తరబడి ముసురు ఉపయోగపడింది. రానున్న రెండు, మూడు నెలల వరకు భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గుతుంది. ఏప్రిల్ నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తాయి కాబట్టి ఇబ్బంది ఉండదు. కానీ నగరం, పరిసరాల్లో వాడుక నీరు రీచార్జి చేసేలా ఇంకుడు గుంతలు విరివిగా తవ్వాలి. ఖాళీ ప్రదేశాలు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయాలి. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో నీరు ఇంకే పరిస్థితి లేదు.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

బృందాలకు ఆదేశించామన్నారు.తహసీల్దార్, మండల సర్వేయర్ కలిసి గ్రామ, బ్లాక్ సరిహద్దులతో పాటు, ప్రభుత్వ భూమి,ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూములు, రైతులకు చెందిన భూముల రీసర్వేకు షెడ్యూల్ రూపొందిస్తారని అన్నారు. రీసర్వే కోసం రైతులు, ఇతర భూ యజమానులకు ముందుగా నోటీసులు అందజేస్తామని, ఆర్డీవో నేతృత్వంలో గ్రామాల్లో సభలు నిర్వహించి రీసర్వే ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. రైతులు, అధికారులతో కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి రీసర్వే చేయనున్న తేదీలు పొందుపరుస్తామన్నారు.

జిల్లాలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారం పక్కాగా జరిగిందా?, లేదా?...అనేది పరిశీలించడానికి జాతీయ రహదారుల విభాగం ఎస్‌డీసీ నేతృత్వంలో ఒక ఆడిట్ టీమ్‌ను ఏర్పాటుచేసినట్టు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ టీమ్‌లో ప్రతి శాఖకు చెందిన అధికారి ఉంటారన్నారు. అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చేయాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోందన్నారు. భూములకు సంబంధించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కంటే రెవెన్యూ సదస్సుల్లోనే ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల కోసం వచ్చే అర్జీలను పరిశీలించి పక్కాగా డాక్యుమెంట్లు ఉంటే వెంటనే తహసీల్దారు జారీచేస్తారన్నారు. ఏమైనా తేడా ఉంటే జిల్లా రెవెన్యూ అధికారి వద్ద అప్పీల్‌కు వెళితే ఆయన పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదల నుంచి అర్జీలు వచ్చాయని, వాటిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేసీ అన్నారు.

ఆరోగ్య శాఖలో ఇ-పాలన

... 5వ పేజీ తరువాయి

ఫైల్ నడపాలని అన్ని సెక్షన్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు సూచించారు. 48 గంటలకు మించి ఫైలు ఆయా సెక్షన్లలో పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమ్స్, ఘోషా, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ఈఎన్‌టీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి సూపరింటెండెంట్లు కూడా సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

వేగవంతానికి అవకాశం

ఇ-పాలనతో ఫైళ్లు వేగంగా కదిలే అవకాశం ఉంటుంది. రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టడానికి అవకాశం ఉండదు. పెండింగ్‌లో పెట్టాలంటే స్పష్టమైన కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ప్రజలు, సిబ్బందికి మేలు జరుగుతుంది. అయితే గతంలో కూడా ప్రభుత్వాలు ఇ-పాలన అమలుకు ఆదేశాలిచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఇబ్బందులు ఎదురవ్వడంతో ప్రక్రియ ముందుకు వెళ్లలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అన్ని శాఖల్లో అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో ఆరోగ్య శాఖ ముందుందని సమాచారం.

హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తం

జీవీఎంసీ జోన్-2 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కిశోర్



ప్రశ్న : హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

జవాబు : జనం ఎక్కువగా ఉన్నచోటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమం. పండగల సమయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. జన సందోహంలోకి వెళ్లినప్పుడు తప్పనిసరిగా శానిటైజర్ వాడడం, మాస్కు ధరించాలి, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలి.

ప్రశ్న : ఈ వైరస్ ఎక్కువగా ఎవరికి సోకే అవకాశం ఉంది ?

జవాబు : చిన్న పిల్లలు, వృద్ధులకు వైరస్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అలాగే కిడ్నీ రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్నవారు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వేకువజామున వాకింగ్ చేసేవారు, మంచులో తిరిగే వారు తప్పనిసరిగా మాస్కు ధరించాలి.

ప్రశ్న : వైరస్ లక్షణాలు ఏమిటి?

జవాబు : జలుబు, దగ్గు, జ్వరం వంటివి ఉంటాయి. వాటికి భయపడవలసిన అవసరం లేదు. కరోనా సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నామో అటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకుని, రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి.

ప్రశ్న : ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు : ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి. శుక్రవారం నుంచి ఏఎస్‌ఎంలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : ఆస్పత్రుల్లో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు ?

జవాబు : ప్రస్తుతం అంత అవసరం లేదు. కేసుల పెరిగి పరిస్థితి తీవ్రంగా ఉంటే కేజీహెచ్, విమ్స్, తదితర ఆస్పత్రుల్లో కోవిడ్ కేర్ సెంటర్ల తరహాలో పడకలు ఏర్పాటు చేస్తాం.

- కొమ్మాది, ఆంధ్రజ్యోతి

వ్యవసాయ మోటార్లకు గ్రహణం

భీమునిపట్నం (రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు నిరుపయోగంగా మారాయి. ఇవి శివారు గ్రామాల్లో ఉండడం వల్ల అధికారులు పట్టించుకోవడం లేదు. లక్ష్మీపురం, కృష్ణంరాజుపేట, నగరపాలెం, రాజులింగంపేట, వలందపేట, కుమ్మరిపాలెం, యాతపేట, మామిడిపాలెం, రాయిపాలెంలో గతంలో ఎస్సీ కార్పొరేషన్ వీటిని రాయితీపై అందించింది. ఇద్దరు ముగ్గురు రైతులు కలిపి ఏర్పాటు చేసుకున్నారు. ఒకప్పుడు లబ్ధిదారులుగా ఉన్న వారు ఇప్పుడు వారికి భూములను అమ్ముకున్నారు. చాలా వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మారిపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో మోటార్లు నిరుపయోగంగా మారాయి. ఈ మోటార్ల లబ్ధిదారులు కొత్తగా విద్యుత్ మోటార్ల కోసం, గొట్టపు బావుల నిర్మాణానికి దరఖాస్తు చేస్తే గతంలో మంజూరు చేశామని చెప్పి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నవి పనిచేయక కొత్తవి ఏర్పాటు చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటివి మండలంలో పదిహేను వరకు ఉన్నాయి. గతంలో గొట్టపుబావులు నిర్మించి వాటికి మోటార్లను అమర్చడం ద్వారా పంటలకు సాగు నీరు అందించేవారు. కొంతకాలంగా వీటిలో చాలా మోటార్లు పనిచేయడం లేదు. ఉన్న కొద్దిపాటి భూములకు నీరు అందడం లేదు. చాలాచోట్ల వ్యవసాయ మోటార్లు, వాటిలో విలువైన పరికరాలు, గొట్టాలు చోరీ అయ్యాయి. ఈ మోటార్లకు గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లు వివిధ కారణాలతో తొలగించారు. నిరుపయోగంగా ఉన్న మోటార్లను వినియోగంలోకి తీసుకుని వస్తే చాలా ప్రయోజనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

జగదాంబ కూడలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్ ప్రాంతంలో కొందరు రేషన్‌డీలర్ల అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది, పేదల బియ్యాన్ని దుకాణాల్లో అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పూర్ణా మార్కెట్‌లోని పండావీధి, ఆయిల్ మిల్ వద్ద 153 రేషన్ దుకాణంలో వన్ టౌన్ పోలీసులు, పౌరసరఫరా శాఖ అధికారుల దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడింది. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ దేముడుబాబు తెలిపిన వివరాలు మేరకు..నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు పండా వీధి ఆయిల్ మిల్లు సందులో ఉన్న రేషన్ దుకాణంలో అక్రమంగా రేషన్‌బియ్యం నిల్వ చేశారు. డీలర్ వద్ద 44 బియ్యం బస్తాలు ఉండాల్సి ఉండగా, అదనంగా 129 బస్తాలు ఉన్నట్టు అధి కారులు గుర్తించారు. అలాగే రేషన్ దుకాణం ఎదురుగా ఒక మినీ వ్యాన్‌లో 14 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేయగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో బియ్యం తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో పట్టుబడిన వ్యక్తులను అధికారులు విచారించగా, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వెంకటేశ్వరరావు పేరుతో ఉన్న ఆ దుకాణాన్ని అధికారులు రద్దు చేశారు.

దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం

విశాలాక్షినగర్,జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 280 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు ఎల్. మన్మథరావు, బి. రామకృష్ణారావు, ఐటీ కోర్ ఎస్‌ఐ బి. సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు

మహారాణిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 18న జరిగే ప్రవేశపరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 11.30 నుంచి 1 వరకు జరిగే ఈ పరీక్షకు 9080 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు.

రహదారుల నిర్మాణంపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఒకరిని కలిపి హై పవర్ కమిటీ వేశారు. వీరంతా కలిసి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) తయారుచేస్తారు. అందులోనే నిర్మాణ వ్యయం, దానిపై ఏయే మార్గాల్లో ఎంతెంత ఆదాయం వస్తుందో ఒక అంచనా రూపొందిస్తారు. తొలుత అత్యంత ప్రధానమైన రహదారిని నిర్మిస్తారు. దానిపై వచ్చే ఆదాయం చూసి, బాగుందంటే...ఆ తరహాలో మరో రహదారి నిర్మాణం చేపడతారు. ఇలా ఒకదాని తరువాత మరొకటి నిర్మిస్తూ.. వెళతారు.

రెవెన్యూ సదస్సుల్లో 834 వినతులు

భీమునిపట్నం,జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 834 వినతులు అందాయి. గత నెల 6వ తేదీ నుంచి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 25 గ్రామాల్లో రోజుకో గ్రామం చొప్పున ఆయా సచివాలయాల్లో ఈ సదస్సులు నిర్వహించారు. వీటిలో రైట్స్ ఆఫ్ రికార్డ్సు ఆర్‌వోఆర్‌కు సంబంధించిన 518 వినతులు రాగా సర్వే నంబర్లకు సంబంధించి 38, సెక్షన్ 22ఏ నుంచి మినహాయింపునకు 66 దరఖాస్తులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై 26, భీమిలిలో ఎండోమెంట్ స్థలాలకు సంబంధించి 3 వినతులు అందాయి. అలాగే కుల ధ్రువీకరణ పత్రం పరిశీలించాలని ఒకటి, ప్రభుత్వ స్థలాలను అసైన్ చేయాలని పది, ల్యాండ్ గ్రాబింగ్‌పై 26 దరఖాస్తులు వచ్చాయి.

నిధుల కేటాయింపుపై హర్షం

డాబాగార్డెన్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు పునరుద్ధరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.10,300 కోట్లు కేటాయించడం ఆనందం కలిగించే అంశమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

తెగ తాగారు

... 5వ పేజీ తరువాయి

గ్రామీణ వాతావరణం ఎక్కువగా ఉండే పెందుర్తి, గాజువాక, గోపాలపట్నం, భీమిలి వంటి ప్రాంతాల్లో పెరిగాయి. భీమిలి సర్కిల్‌లోని 32 దుకాణాలు, పెందుర్తి సర్కిల్‌లోని 36 దుకాణాలు, గాజువాక సర్కిల్‌లోని 33 దుకాణాలు, గోపాలపట్నం సర్కిల్‌లోని 14 దుకాణాల్లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మొత్తమ్మీద జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలను పరిశీలిస్తే సాధారణ రోజుల్లో కంటే దాదాపుగా రెట్టింపు విక్రయించినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

అగర్తాలా-బెంగళూరు హంసఫర్ (12504), హటియా-బెంగుళూరు (12835), కామాఖ్య-బెంగళూరు (12552) వంటి పలు వారాంతపు రైళ్లకు మార్చి ఎనిమిదో తేదీ వరకూ డిమాండ్ ఏర్పడి దాదాపు బెర్తులు నిండిపోయాయి.

హౌరా రైళ్లకు నెలాఖరు వరకు డిమాండ్

హౌరా వెళ్లే కోరమండల్ (12842), మెయిల్ (12840), ఈస్ట్ కోస్ట్ (18046), ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12704) వంటి రెగ్యులర్ రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది.

శని, ఆదివారం రిగ్రెట్

ప్రయాణికుల సంఖ్య గణనీయంగా ఉన్న నేపథ్యంలో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే పలు రైళ్లకు శని, ఆదివారాల్లో రిగ్రెట్ (నో రూమ్) ఏర్పడింది. దీంతో రిజర్వేషన్ పొందనివారు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బైక్ బోల్తా పడి ముగ్గురికి గాయాలు

ఎండాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న బైక్ బోల్తా పడడంతో ముగ్గురు గాయపడ్డారు. రుషికొండ ప్రధాన రహదారిపై గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది.పీఎంపాలెం పోలీసుల వివరాలు ప్రకారం... జి. శివ, బసవాన షణ్ముక్ సాయికుమార్, పిల్లా శ్రీనివాస్ బైక్‌పై వెళుతుండగా రుషికొండ ఏ1 గ్రాండ్ హోటల్ ప్రాంతానికి చేరుకునే సరికి టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడ్డారు. శివకు తీవ్ర గాయాలు కాగా,మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారు రెల్లివీధికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు.

అధ్వానంగా కలాం పార్కు

- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ప్రాంగణంలో మద్యం సీసాలు
- యథేచ్ఛగా పశువుల సంచారం
- అపరిశుభ్రంగా పరిసరాలు


పార్కు ప్రాంగణంలో పడి ఉన్న మద్యం సీసాలు


పార్కులో సంచరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో గల అబ్దుల్ కలాం పార్కు అధ్వానంగా తయారవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న ఈ పార్కును ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో అభివృద్ధి చేశారు. చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. బోరుబావి, రెండు గేట్లను కూడా ఏర్పాటు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పార్కు నిర్వహణను గాలికొదిలేశారు. ఈ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన నాయకురాలు ఎన్నికల ప్రచారంలో మాత్రం ఈ పార్కును సర్వాంగసుందరంగా అభివృది చేస్తానంటూ హామీ ఇచ్చారు. ఆ తర్వాత పట్టించుకోలేదు.

అంతేకాకుండా మధ్యలో ఈ పార్కును తీసేసి సచివాలయం నిర్మాణం కూడా చేపట్టేందుకు షాడో కార్పొరేటర్ (కార్పొరేటర్ భర్త) ప్రతిపాదన తీసుకొచ్చారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారితో శంకుస్థాపన కూడా చేయించారు. ఈ విషయమై అప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో పాటు విమర్శలు వెల్లువెత్తడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు.

అంతేకాకుండా అప్పట్లో కోర్టు కూడా పార్కు స్థలాన్ని దుర్వినియోగం చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. దీంతో పార్కులో సచివాలయం నిర్మాణం చేపట్టే అవకాశం లేకుండా పోయింది. అదే సమయంలో పార్కు అభివృద్ధిని కూడా పూర్తిగా విస్మరించారు.

ప్రస్తుతం ఈ పార్కు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా అధ్వానంగా మారిపోయింది. కాస్తోకూస్తో పార్కులా కనిపిస్తుందంటే ఇక్కడ ప్రతి రోజూ ఉదయం పూట షెటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు, కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారుల వల్లేనని స్థానికులు పేర్కొంటున్నారు.

పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో మందుబాబులు, పేకాటరాయుళ్ల, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి స్థావరంగా మారింది. ఇప్పటికే వాకింగ్ ట్రాక్‌లోని చాలా వరకు టైల్స్ పోయాయి. బోరింగ్ వద్ద బురద, పార్కు నిండా మద్యం సీసాలు పేరుకుపోయాయి. స్థానికులు కొందరు పశువులను కట్టారు. దీంతో నిత్యం పశువుల సంచారం ఉంటుంది. ఆట స్థలంలో ఆవుల పేడలు వెరసి పార్కు అంతా అస్తవ్యస్తంగా తయారైంది.


పేడ, చెత్తాచెదారంతో నిండిన పార్కు

ఈ పార్కులో వేడుకలు నిర్వహించుకునేందుకు కొంతమంది పార్కుకు ఒక చోట గోడను విరగొట్టారు. ఇంకో పక్క చిన్న గేటును ఆకతాయిలు విరగొట్టేశారు. ఇక మిగిలినది పెద్ద గేటు. అది కూడా ఉందో లేదో అన్నట్టుగా మిగిలింది. దీంతో అసాంఘిక కార్యకలాలు, ఆవుల సంచారం విచ్చలవిడిగా సాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల

దరఖాస్తులకు గడువు పొడిగింపు

వెంకోజీపాలెం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో 8 మంది స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకానికి న్యాయవాదుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును పొడిగించినట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన ప్రకారం ఈ నెల 6వ తేదీలో గడువు ముగియగా, దీన్ని జనవరి 25 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరి (ఓసీ జనరల్)-4, వెనుకబడిన తరగతి గ్రూపు (ఏ)-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్-1, షెడ్యూల్ తెగలు వారు (ఎస్టీ)-1, వెనుకబడిన తరగతుల వారు గ్రూప్(బి)-1ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో కనీసం 10 సంవత్సరాల మెంబర్‌గా రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. ఆసక్తి గత అభ్యరులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.

తాగునీరు వృథా

ఆరిలోవ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల చినగదిలిలోని షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో గల ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పైపులైన్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీంతో రోజూ తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ భూమిలో ఉన్న పైప్ లైన్‌కు ఉన్న జంక్షన్‌లో నీరు విడిచిపెట్టేందుకు ఒక లాకర్ బోల్ట్ ఉంటుంది. దాన్ని పూర్తిగా లూజ్ చేసి నీరు విడిచి పెడతారు. ఇది ప్రతి రోజూ జరిగి ప్రక్రియ. అయితే నీరు సరఫరా సమయం పూర్తయిన తర్వాత ఈ వాల్వ్‌ను సరిగా బిగించకపోవడం వల్లే రోజంత నీరు లీక్ అవుతూ వృథాగా పోతున్నది. నీటి సరఫరా విభాగం కింది స్థాయి నిర్లక్ష్యం కారణంగా రోజూ వేలాది గ్యాలన్ల తాగునీరు వృథాగా పోతున్నది స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చినగదిలిలోని షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో గల ప్రధాన కాలువ లీకేజీతో వృథాగా అవుతున్న తాగునీరు

నేడు కోదండ రామలీల పరస

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి ప్రక్కన శుక్రవారం సాయంత్రం కోదండరామలీల పరస మహోత్సవం జరుగనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనక రాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడులు చెప్పారు.

ఈ సందర్భంగా రామాలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగనున్నట్టు తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొని పరసను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, వినతులను ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీకరిస్తారని కమిషనరు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలియజేశారు.

సముద్ర తాబేళ్ల రక్షణకు పటిష్ఠ చర్యలు

అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సముద్రతాబేళ్ల సముద్ర వాతావరణంలో పరిరక్షణకు కీలకపాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. తాబేళ్ల సంరక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. గుడ్లు పెట్టేందుకు వేల కిలోమీటర్ల దూరం పయనించి మన తీరానికి వచ్చే తాబేళ్లు ఇటీవల మృత్యువాత పడుతున్నాయని అన్నారు. సముద్రంలో చేపలవేట కోసం వేసే వలలు, తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో తాబేళ్లు చిక్కుకుని మరణిస్తున్నాయన్నారు. అలాగే తీరానికి వచ్చి పెట్టిన గుడ్లను జంతువులు తినేస్తున్నాయన్నారు. భవిష్యతులో ఆలివ్‌రెడ్ల తాబేళ్ల సంఖ్య తగ్గడం, లేదా అంతరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనికి పరిగణనలో తీసుకుని చేపలవేట చేసే ట్రాల్ నెట్‌లో టెడ్(తాబేళ్లు తప్పించుకునే పరికరం) ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పారబోయకుండా ప్రతిబోటులో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి దాంట్లో సేకరించిన ప్లాస్టిక్‌ను ఒడ్డుకు తీసుకురావాలన్నారు. ఒడిశా తీరంలో సముద్ర తాబేళ్లు వచ్చే ప్రాంతంలో చేపలవేట నిషేధించిందని గుర్తు చేశారు. చేపలవేటకు కోసం బోట్లకు ప్రకాశవంతమైన లైట్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల సముద్రంలో మత్స్యసంపద తగ్గిపోతుందన్నారు. చేపలవేట కోసం లైట్లు వినియోగించవద్దని సూచించారు. సమీక్షలో మత్స్యశాఖ డీడీ లక్ష్మణరావు, అటవీ శాఖ అధికారి శ్రీవాణి, మత్స్య సంస్థల శాస్త్రవేత్తలు డాక్టరు శ్రీధర్, జోయ కిజారుద్దీన్, భామిరెడ్డి, ప్రసాద్,ఇంకా బోటు యజమాను ల సంఘం అధ్యక్షులు వీర్రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


తాబేళ్ల రక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పురుగుల మందు తాగి భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి

సీతమ్మధార/ భీమునిపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మొక్కలకు వేసేందుకు తెచ్చిన పురుగుల మందును పొరపాటుగా తాగడంతో భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి చెందాడు. అయితే అక్కాచెల్లెళ్ళకు అప్పు ఇప్పిం చేందుకు ష్యూరిటీ సంతకాలు చేసి, వారు మోసం చేయడంతో ఆవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీతమ్మధార ఆర్ అండ్ బీ క్వార్టర్‌లో ఎం.డి. మస్తాన్ (45) భార్య మహ్మద్ ఫాతీమా, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. మస్తాన్ భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. తన పెద్ద కుమార్తె సుఫీయా పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుండగా, చిన్న కుమార్తె రఫియా ఇంటర్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. మస్తాన్ ఇంటి వద్ద పెంచుకున్న మొక్కలకు మందులు కొట్టడానికి ఈ నెల 14న పురుగుల మందు తెచ్చాడు. మొక్కలు కొట్టే నిమిత్తం అదే రోజు మందును నీటిలో కలిపి పెట్టాడు. రాత్రి అయిపోవడంతో ఉదయం లేచి మొక్కలకు కొట్టమని కుటుంబ సభ్యులు సూచించడంతో మందు కలిసిన గ్లాసును అక్కడే వదిలేశాడు. ఆయనకు ఉదయాన్నే కాకరకాయ రసం తాగడం అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో 15వ తేదీన ఉదయం నిద్ర లేచిన మస్తాన్, ముందు రోజు కలిసిన పురుగుల మందు విషయం మర్చిపోయి గ్లాసులో ఉన్న ద్రావణాన్ని తాగేశాడు. కొంతసేపటి తర్వాత పురుగులు మందు గ్లాసు కనిపించకపోయేసరికి అతడి భార్య ఫాతిమా అడిగింది. అయితే అది కాకరకాయ రసం అని తాను తాగేసినట్టు మస్తాన్ చెప్పాడు. వెంటనే ఫాతిమా తన సోదరుడి సహాయంతో మస్తాన్‌ను సమీపంలో గల ఏఎంజి ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మస్తాన్ బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య ఫాతిమా ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కుటుంబ సభ్యులతో ముస్తాఫా (ఫైల్ ఫోటో)

ష్యూరిటీ సంతకాలు చేసి అప్పు తీర్చలేక..

గత కొంత కాలంగా కలెక్టరేట్ పని చేసిన మస్తాన్ కొద్ది రోజుల క్రితమే భీమిలీ తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా బదిలీ అయ్యాడు. తన అక్కచెల్లెలకు డబ్బులు అప్పు నిమిత్తం కొన్ని రూ.లక్షలకు ష్యూరిటీ సంతకం చేశాడు. అయితే ఆ అప్పు అక్కాచెల్లెళ్ల కట్టకపోవడంతో మస్తాన్ చెల్లించాల్సిన పరిస్థిఇ ఏర్పడింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కొందరు బంధువులు, సహోద్యోగులు అంటున్నారు.


నితీశ్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా గడ్డపై ఇటీవల జరిగిన క్రికెట్ టెస్ట్ సీరిస్‌లో సెంచరీతో ఆకట్టుకున్న తుంగ్లాం యువకుడు కాకి నితీశ్‌కుమార్‌రెడ్డిని కాలనీ యువకుల తోపాటు బీహెచ్‌పీవీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. నగరంలో ఉంటున్న నితీశ్‌ను గురువారం అసోసియేషన్ నాయకులు జె.రాము, ఎం.నానిబాబు, హరిబాబు, అబ్దుల్ రహీం తదితరులు కలిశారు. క్రికెట్‌లో మరింత ప్రతిభ చూపి తుంగ్లాంకు తగిన గుర్తింపు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద గురువారం రెండు కిలోల గంజాయి పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 87 వార్డు పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన ఎలుగుబంటి ఆనంద్ వెంకటకుమార్ అరకులో గుర్తు తెలియని వ్యక్తి వద్ద దంజాయి కొనుగోలు చేసి, పండగ నేపథ్యంలో ఎక్కువ రేటుకు విక్రయించుకోవచ్చని ఊహించ వస్తుండగా తమను చూసి పరుగు తీశాడని చెప్పారు. దీంతో అతన్ని పట్టుకొని విచారించగా గతంలో రెండు కేసుల్లో దువ్వాడలో ముద్దాయిగా ఉన్నట్టు అంగీకరించాడన్నారు. అతన్ని అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విశాఖ, చెర్లపల్లి మధ్య సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, చెర్లపల్లి, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-చెర్లపల్లి-భువనేశ్వర్

08549 నంబరు గల రైలు ఈ నెల 18న (శనివారం) రాత్రి 7.45 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.00 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08550 నంబరు గల రైలు ఈనెల 19న (ఆదివారం) ఉదయం 9.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.30 విశాఖ, మర్నాడు వేకువజాము 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, నాలుగు థర్డ్ ఏసీ, తొమ్మిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ

08509 నంబరు గల రైలు ఈనెల 18న (శనివారం) సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం8.00 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08510 నంబరు గల రైలు ఈనెల 19న ఉదయం 10.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, ఒక థర్డ్ ఏసీ, 11 స్లీపర్, ఏడు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజీ కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ

08551 నంబరు గల రైలు ఈనెల 19న (ఆదివారం) సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08552 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 10.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, ఒక థర్డ్ ఏసీ, 11 స్లీపర్, ఐదు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని చంద్రనగర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ పరిధిలోని 89వ వార్డు చంద్రనగర్ పరదేశమ్మ ఆలయ సమీపంలో కొత్తోజు మీనాక్షి తన కుమారుడు అజయ్(20)తో కలిసి నివాసం ఉంటున్నారు. క్యాటరింగ్ పనులకు వెళ్లే అజయ్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని తరచూ ఒత్తిడి చేస్తుండేవాడు. పార్వతీపురంలోని బంధువుల ఇంటికి పండగ సందర్భంగా వెళ్లిన మీనాక్షి, గురువారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులను ఎంత కొట్టినా తీయకపోవడంతో పక్కన ఉన్న కిటికీలో నుంచి చూడగా, ఆమె కుమారుడు అజయ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే స్థానికుల సాయంతో ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా అజయ్ మృతి చెందినట్టు గుర్తించారు.ఈ ఘటనపై గోపాలపట్నం పోలీసులకు మీనాక్షి ఫిర్యాదు చేయగా, వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిరిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు రక్షణ కోసం ఈ నెల 19న పాత గాజువాకలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకుడు రెడ్డి వెంకట్రావు కోరారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షలకు ఆయన హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి దేశంలో ఉండే ప్రభుత్వ రంగ పరిశ్రమలు అన్నిటిని ప్రైవేట్‌పరం చేయడానికి కంకణం కట్టుకున్నదని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటంలో భాగంగా ఈ నెల 19న జరిగే పోరాటంలో విశాఖ ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కుమార్ మంగళం, గోపాలకృష్ణ, జగన్నాథం, ఎస్వీ రమణ, జి.అప్పారావు, చలపతి, కుమారి, ఆనంద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 46, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 72, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

వారం రోజులుగా నిలిచిన ఏపీ ఫైబర్ ప్రసారాలు

వినియోగదారులు అసంతృప్తి

రామ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ప్రసారాలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండగ సమయంలో టీవీ ప్రసారాలు నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండగ సెలవుల నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ఉంటాయని, ఇలాంటి సమయంలో ప్రసారాలు నిలిచిపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. రామ్‌నగర్‌తో సహా స్థానికంగా పలు ప్రాంతాల్లో వారం రోజులుగా టీవీ, ఇంటర్‌నెట్ ప్రసారాలు నిలిచిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ నెట్ వర్క్ సరైన నిర్వహణ సామర్థ్యం లేని వారికి అప్పగించడం వల్లే ఇలా తరచూ ప్రసారాలు ఆగిపోతున్నాయని వినియోగదారులు మండి పడుతున్నారు.

ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తూ ఇలా నెలలో వారాల తరబడి ప్రసారాలు నిలిచిపోవడం ఇబ్బందిగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్య వైఖరి కూడా కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆపరేటర్లు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరతున్నారు.

ఏయూలో అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించాలి

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో అన్యాక్రాంతమవుతున్న భూములను పరిరక్షించాలని కోరుతూ ఏయూ రెక్టార్ కిషోర్‌బాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పూర్వ విద్యార్థుల సంక్షేమ సభ్యులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ తక్కువ అద్దెకు ఇచ్చి వర్సిటీ ఆదాయానికి గండి కొడుతున్న రాజారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పలు భూములను ఆక్రమణలకు గురి అవుతున్నాయని, వాటిని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్, కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ శిరీష్‌కుమార్, డాక్టర్ బి.సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇదేం నిర్వాకం!



నక్కవానిపాలెం రోడ్డు మధ్య వదిలేసిన చెట్టు దుంగ

సీతమ్మధార, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో భోగి మంటల్లో వేసిన పెద్ద చెట్టు దుంగను మార్గం మధ్యలో వదిలేశారు. మంటలో వేసిన ఈ దుంగ కాలకపోవడం, వేసిన వారు తొలగించకపోవడతో రహదారికి అడ్డంగా ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. రాత్రి పూట అటుగా ప్రయాణించే వాహనదారులు రోడ్డు మధ్యలో దుంగను గమనించకపోవడంతో చిన్న చిన్న ప్రమాదాలకు గురయ్యారు. భోగి మంటలు వేసినవారు విజ్ఞతతో వ్యవహరించకుండా ఇలా రోడ్డుపై దుంగను వదిలేయడంతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తోంది. దుంగను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

2 నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2, 3 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ కమ్ రాష్ట్ర స్థాయి టోర్నీకి జిల్లా జట్ల ఎంపికలు జరగనున్నాయి. ఏవీఎన్ కాలేజీ బ్యాడ్మింటన్ హాలులో జరిగే ఈ టోర్నీలో 35 ప్లస్ నుంచి 75 ప్లస్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయని సంఘం కార్యదర్శి పల్లా శ్రీనివాస్ తెలిపారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో పాల్గొనేవారు ఈనెల 30లోగా ఎంట్రీలు పొందాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 93477 89831, 94403 67158లో సంప్రదించాలన్నారు.

కూడళ్లలో కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్

» ఇష్టానుసారంగా రాకపోకలు » తరచూ ప్రమాదాలు » ఆచూకీ లేని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

డాబాగార్డెన్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా ఉన్నాయి. సరస్వతీ పార్కు, డాబాగార్డెన్స్ జంక్షన్, డాబాగార్డెన్స్ ఎల్ఐసీ అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాల్లో ఒక్క చోటైనా.. దీపాలు వెలగకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అసలే సంక్రాంతి పండుగ సీజన్ కావడంతో.. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనదారులు అంబేడ్కర్ సర్కిల్, డాబాగార్డెన్స్, సరస్వతీ పార్కు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నలువైపులా కూడళ్లు ఉండటంతో పాటు ఎవరికి వారు ఇష్టానుసారంగా ఒకేసారి వచ్చేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ముఖ్యమైన ప్రాంతాల్లో కనీసం ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా లేకపోవడంతో సమస్య జటిలంగా తయారైంది. ముఖ్యమైన కూడళ్ల వద్ద ఫుట్‌పాత్‌లపై కొందరు వ్యాపారాలు చేస్తుండడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. ఇటీవల సరస్వతీ జంక్షన్ వద్ద రెండు ప్రమాదాలు జరగడంతో వాహనదారులు కింద పడిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద పని చేయని సూచికలు

భయమేస్తోంది..

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేయకపోవడంతో భారీ వాహనం వెనుక వెళ్లాల్సినప్పుడు ఒక్కసారిగా వేగ నియంత్రణ చేయాలంటే కష్టతరంగా ఉంటోంది. అదే ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలుగుతూ ఉంటే దూరం నుంచే వాటిని గమనించి ఆగేందుకు అవకాశం కలుగుతుంది. తక్షణమే వీటిని వినియోగంలోకి తీసుకురావాలి. -రాజా, వాహనదారుడు

రెండుసార్లు ప్రమాదాలు చూశా

సెంటర్‌పాయింట్ జంక్షన్‌లో ప్రమాదాలు నా కళ్లెదుటే రెండుసార్లు చోటుచేసుకున్నాయి. కనీసం ఆయా ప్రాంతాల్లో ఒక్క కానిస్టేబుల్ కూడా లేరు. ఉన్నతాధికారులు సరైన పర్యవేక్షణ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించాలి. లేకుంటే మహిళలు బయటకు వచ్చే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. -సౌమ్య, వాహనచోదకురాలు

రోడ్డును ఆక్రమించి పశువుల పెంపకం

80 ఫీట్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డుపైనే పశువులను కట్టిన దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో పశువులను కట్టి వేయడంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును సగానికి పైగా ఆక్రమించి పశువులను కట్టి మేపుతుండడంతో చాలా మంది మండిపడుతున్నారు. వీటిని పెంచడం వల్ల అక్కడే ఆవులు మల, మూత్ర విసర్జనం చేస్తుండడంతో రోడ్డంతా అధ్వానంగా తయారవుతోందని స్థానికులు వాపోతున్నారు.

జీవీఎంసీ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు కొందరు ఇలా పశువుల పెంపకానికి వినియోగిస్తుండడం, రోడ్డు అపరిశుభ్రంగా తయారవుతుండడంతో అటు వైపుగా రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన కూడా సమస్యగా మారుతోందని అంటున్నారు. ఇలా దర్జాగా రోడ్డుపై ఆవులను కట్టి మేపుతుంటే, అధికారులెవరూ పట్టించుకోకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించి మేపుతున్న ఆవుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతుకుల రోడ్లకు మోక్షం



ఆర్టీఏ కార్యాలయం రోడ్డులో గతుకులను పూడ్చుతున్న సిబ్బంది

మురళీనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలో పరిధి రోడ్లకు గతుకుల నుంచి మోక్షం లభించింది. ఇటు నియోజకవర్గ బోర్డరుగా ఉన్న 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ అంబేడ్కర్ కాలనీ నుంచి అటు సీతమ్మధార వరకు రోడ్డు మధ్య ఉన్న గతుకులను పూడ్చుతూ పనులు చేపట్టారు. జీవీఎంసీ కాంట్రాక్టు ప్రాతిపదికన ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో గతుకులను ప్యాచ్ వర్క్‌లతో సరిదిద్దారు. కొన్నేళ్లుగా ఉన్న ఈ గతుకులదారుల్ని అధికార ఎన్డీఏ ప్రభుత్వ ఆదేశాలతో తక్షణ మరమ్మతులు చేపట్టారు.

జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ ఆర్టీఏ దారిలో నీటి పైపులైన్ల మరమ్మతుల కోసం చేపట్టిన తర్వాత తవ్విన రోడ్డును నాలుగేళ్లుగా అలాగే వదిలేశారు. ఇపుడు ఈ దారికి తారు రోడ్డు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. పోర్టు క్వార్టర్సు దారిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డివైడర్లు వేసి మార్కర్లు వేశారు. గ్రేటర్ విశాఖ 49వ వార్డు బర్మాక్యాంపు రోడ్డు, మాధవధార జంక్షన్, మురళీనగర్ సెక్టారు దారుల్లో ఏర్పడిన యూజీడీ, నీటి పైపులైన్ల మరమ్మతుల తవ్వకాల దారులను నవీకరించడంతో ప్రయాణికులకు ఊరట లభిస్తోంది.

హామీ ఇస్తే నెరవేర్చేది కూటమి ప్రభుత్వం

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఆంధ్రజ్యోతి 16 (ఆంధ్రజ్యోతి) : మాటిస్తే చేసి చూపించే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు'ను పటిష్ఠంగా నిలబెట్టే చర్య అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.10,300 కోట్లు ఆర్థిక ప్యాకేజీ దిశగా అడుగులు పడడం ఆనందకరమన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయనుందన్నారు. విశాఖ ఉక్కు కోసం ఆలోచన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, యువగళంలో మాటిచ్చి నిలబెట్టిన నారా లోకేష్, స్టీల్‌ప్లాంట్‌లో సభ పెట్టి భరోసా నిచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర వాసులు తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

రహదారుల నిర్మాణంపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఒకరిని కలిపి హై పవర్ కమిటీ వేశారు. వీరంతా కలిసి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) తయారుచేస్తారు. అందులోనే నిర్మాణ వ్యయం, దానిపై ఏయే మార్గాల్లో ఎంతెంత ఆదాయం వస్తుందో ఒక అంచనా రూపొందిస్తారు.

తొలుత అత్యంత ప్రధానమైన రహదారిని నిర్మిస్తారు. దానిపై వచ్చే ఆదాయం చూసి, బాగుందంటే...ఆ తరహాలో మరో రహదారి నిర్మాణం చేపడతారు. ఇలా ఒకదాని తరువాత మరొకటి నిర్మాణం చేసుకుంటూ వెళతారు.

తెగ తాగారు

... 5వ పేజీ తరువాయి

గ్రామీణ వాతావరణం ఎక్కువగా ఉండే పెందుర్తి, గాజువాక, గోపాలపట్నం, భీమిలి వంటి ప్రాంతాల్లో పెరిగాయి. భీమిలి సర్కిల్‌లోని 32 దుకాణాలు, పెందుర్తి సర్కిల్‌లోని 36 దుకాణాలు, గాజువాక సర్కిల్‌లోని 33 దుకాణాలు, గోపాలపట్నం సర్కిల్‌లోని 14 దుకాణాల్లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మొత్తమ్మీద జిలావ్యాప్తంగా మద్యం విక్రయాలను పరిశీలిస్తే సాధారణ రోజుల్లో కంటే దాదాపుగా రెట్టింపు విక్రయించినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

అగర్తాలా-బెంగళూరు హంసఫర్ (12504), హటియా-బెంగుళూరు (12835), కామాఖ్య-బెంగళూరు (12552) వంటి పలు వారాంతపు రైళ్లకు మార్చి ఎనిమిదో తేదీ వరకూ డిమాండ్ ఏర్పడి దాదాపు బెర్తులు నిండిపోయాయి.

హౌరా రైళ్లకు నెలాఖరు వరకు డిమాండ్

హౌరా వెళ్లే కోరమండల్ (12842), మెయిల్ (12840), ఈస్ట్ కోస్ట్ (18046), ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12704) వంటి రెగ్యులర్ రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది.

శని, ఆదివారం రిగ్రెట్

ప్రయాణికుల సంఖ్య గణనీయంగా ఉన్న నేపథ్యంలో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే పలు రైళ్లకు శని, ఆదివారాల్లో రిగ్రెట్ (నో రూమ్) ఏర్పడింది. దీంతో రిజర్వేషన్ పొందనివారు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆరోగ్య శాఖలో ఇ-పాలన

... 5వ పేజీ తరువాయి

ఫైల్ నడపాలని అన్ని సెక్షన్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు సూచించారు. 48 గంటలకు మించి ఫైలు ఆయా సెక్షన్లలో పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమ్స్, ఘోషా, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ఈఎన్‌టీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి సూపరింటెండెంట్లు కూడా సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

వేగవంతానికి అవకాశం

ఇ-పాలనతో ఫైళ్లు వేగంగా కదిలే అవకాశం ఉంటుంది. రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టడానికి అవకాశం ఉండదు. పెండింగ్‌లో పెట్టాలంటే స్పష్టమైన కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ప్రజలు, సిబ్బందికి మేలు జరుగుతుంది. అయితే గతంలో కూడా ప్రభుత్వాలు ఇ-పాలన అమలుకు ఆదేశాలిచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఇబ్బందులు ఎదురవ్వడంతో ప్రక్రియ ముందుకు వెళ్లలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అన్ని శాఖల్లో అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా ఇందులో ఆరోగ్య శాఖ ముందుందని సమాచారం.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

బృందాలకు ఆదేశించామన్నారు. తహసీల్దార్, మండల సర్వేయర్ కలిసి గ్రామ, బ్లాక్ సరిహద్దులతోపాటు, ప్రభుత్వ భూమి, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూములు, రైతులకు చెందిన భూముల రీసర్వేకు షెడ్యూల్ రూపొందిస్తారని అన్నారు. రీసర్వే కోసం రైతులు, ఇతర భూ యజమానులకు ముందుగా నోటీసులు అందజేస్తామని, ఆర్డీవో నేతృత్వంలో గ్రామాల్లో సభలు నిర్వహించి రీసర్వే ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. రైతులు, అధికారులతో కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి రీసర్వే చేయనున్న తేదీలు పొందుపరుస్తామన్నారు.

జిల్లాలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారం పక్కాగా జరిగిందా?, లేదా?....అనేది పరిశీలించడానికి జాతీయ రహదారుల విభాగం ఎస్డీసీ నేతృత్వంలో ఒక ఆడిట్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ టీమ్‌లో ప్రతి శాఖకు చెందిన అధికారి ఉంటారన్నారు. అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చేయాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోందన్నారు. భూములకు సంబంధించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కంటే రెవెన్యూ సదస్సుల్లోనే ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల కోసం వచ్చే అర్జీలను పరిశీలించి పక్కాగా డాక్యుమెంట్లు ఉంటే వెంటనే తహసీల్దారు జారీచేస్తారన్నారు. ఏమైనా తేడా ఉంటే జిల్లా రెవెన్యూ అధికారి వద్ద అప్పీల్‌కు వెళితే ఆయన పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదల నుంచి అర్జీలు వచ్చాయని, వాటిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేసీ అన్నారు.

స్టీల్‌ప్లాంటుకు నిధుల కేటాయింపుపై హర్షం

డాబాగార్డెన్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు పునరుద్ధరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.10,300 కోట్లు కేటాయించడం ఆనందం కలిగించే అంశమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ఒక పరిశ్రమ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. స్పెషల్ ప్యాకేజీ కేటాయించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకం..

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నుంచి బయటపడిందన్న సంకేతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ప్లాంట్ నిర్వహణకు 10,300 కోట్ల ప్యాకేజీ ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. ప్రధానిని ఒప్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చూపించిన చొరవ మరలేనిదని తెలిపారు.

బాబోయ్ దుర్వాసన



కనకమ్మవారి వీధిలో రోడ్డుపై చెత్త

సీతమ్మధార, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 23వ వార్డు చైతన్యనగర్ కనకమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి కూడలిలో యూజీడీ నుంచి మురుగునీరు పొంగి పారుతోంది. కూడలిలో విద్యుత్ స్తంభం వద్ద స్థానికులు వేసిన చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా రాకపోకలు సాగించేవారు బురద నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బాబోయ్ కంపు! అంటూ స్థానికులు ముక్కున వేలేసుకుని వెళ్తున్నారు. అధికారుల స్పందించి పేరుకుపోయిన చెత్తను, యూజీడీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్ణా మార్కెట్‌లో రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం

జగదాంబ కూడలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్ ప్రాంతంలో కొందరు రేషన్ డీలర్ల అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది, పేదల బియ్యాన్ని దుకాణాల్లో అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పూర్ణా మార్కెట్‌లోని పండావీధి, ఆయిల్ మిల్ వద్ద 153 రేషన్ దుకాణంలో వన్ టౌన్ పోలీసులు, పౌర సరఫరా శాఖ అధికారుల దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడింది. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ దేముడుబాబు తెలిపిన వివరాలు మేరకు.. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు పండా వీధి ఆయిల్ మిల్లు సందులో ఉన్న రేషన్ దుకాణంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారు. డీలర్ వద్ద 44 బియ్యం బస్తాలు ఉండాల్సి ఉండగా, అదనంగా 129 బస్తాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే రేషన్ దుకాణం ఎదురుగా ఒక మినీ వ్యాన్‌లో 14 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేయగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో బియ్యం తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో పట్టుబడిన వ్యక్తులను అధికారులు విచారించగా, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అంగీకరించారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వెంకటేశ్వరరావు పేరుతో ఉన్న ఆ దుకాణాన్ని పౌర సరఫరాశాఖ అధికారులు రద్దు చేశారు.

నవోదయ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు

మహారాణిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 18న జరిగే ప్రవేశపరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 11.30 నుంచి 1 వరకు జరిగే ఈ పరీక్షకు 9080 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు.

అతిసార నివారణపై అవగాహన అవసరం

మహారాణిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అతిసారపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సి. సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్ జంక్షన్‌లోని సమావేశ మందిరంలో పిల్లల్లో అతిసార వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జరిగిన సదస్సులో మాట్లాడారు.

ఈ బైక్ ఎవరిదో..?



మర్రిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మర్రిపాలెం ప్రధాన రహదారి మూడు రోడ్ల జంక్షన్ వద్ద పది రోజులుగా ఒక బైక్ పార్క్ చేసి ఉంది. దీన్ని ఎవరు ఎందుకు ఇక్కడ పార్క్ చేశారో తెలియడం లేదు. ఎవరైనా దొంగలించి ఇక్కడ వదిలేశారా లేదా మరే ఇతర కారణం ఉందా అని స్థానికులు అను మానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ విషయమై స్పందించాలని పలువురు కోరుతు న్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

అల్లిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురంలో నేరెళ్లకొనేరు ప్రాంతానికి చెందిన ఈశ్ల తులసీరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ముందుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తులసీరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేరి, కనక, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజాధిరాజా అలంకరణలో అప్పన్నస్వామి

సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు గురువారం రాజాధిరాజా అలంకరణలో దర్శనమిచ్చారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం రాజభోగం, పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాలుపై కాలు వేసుకున్న రాజాధిరాజుగా అలంకరించి, మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం



అభ్యర్థుల పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 280 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఆర్ఐలు ఎల్. మన్మథరావు, బి. రామకృష్ణారావు, ఐటీ కోర్ ఎస్ఐ బి. సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు రాలినా...ప్చ్!

... 5వ పేజీ తరువాయి

నెలాఖరుకు 10 మీటర్లు, అంతకంటే తక్కువకు పడిపోవడం, కొన్నిచోట్ల పెరుగుదల కనిపించింది. నగరంలో విచ్చలవిడిగా భూగర్భ జలాల వినియోగం సాగడంతో వచ్చే వేసవిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరించారు.

గ్రామీణంలో పెరుగుదల

ఆనందపురం మండలం శొంఠ్యాంలో డిసెంబరుకు సంబంధించి 2022లో 8.09 మీటర్లున్న భూగర్భ జల మట్టాలు 2023లో 5.1 మీటర్లు, ఈ ఏడాది 4.21 మీటర్లుగా నమోదయ్యాయి. భీమిలి మండలం చిప్పాడలో 2022లో 5.13 మీటర్లుండగా, ఈ ఏడాది 1.99, పెందుర్తి మండలం నరవలో 2022లో 5.13 మీటర్లు, ప్రస్తుతం 1.25, ఎంపీడీవో కార్యాలయం వద్ద 8.09 మీటర్లుండగా ప్రస్తుతం 7.19 మీటర్లలో ఉన్నాయి. కాగా గ్రామీణ ప్రాంతంలో జనావాసాలు ఎక్కువగా ఉన్నచోట, అభివృద్ధి జరిగే ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. భీమిలిలో ఏపీ గురుకులం వద్ద 2022లో 5.13 మీటర్లు ఉండగా ప్రస్తుతం 7.39 మీటర్లకు పడిపోయింది. నగరంలో అనేక చోట్ల డిసెంబరులో భారీగా జలమట్టాలు పడిపోయాయి. గాజువాక కణితి కాలనీలో 2022లో 4.56 మీటర్లుండగా గత ఏడాది 10.27కు, ప్రస్తుతం 11.23 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద 2022లో 5.13 మీటర్లున్న భూగర్భ మట్టాలు గత ఏడాది 14.22కు, ఈ నెలలో 12.65కు, మారికవలస బిస్లరీ యూనిట్ వద్ద వరుసగా 5.13, 10.44, 9.45, మధురవాడ ఆస్పత్రి వద్ద 2022లో 5.23 ఉండగా, గత ఏడాది 13.73, ప్రస్తుతం 11.89 మీటర్లకు పడిపోయింది. నగరంలో సెంట్రల్ పార్కు వద్ద 2022లో 3.76 మీటర్లు ఉండగా, 2023లో 13.63, ప్రస్తుతం 13 మీటర్లు, ఏయూ యోగా విలేజ్ వద్ద 6.36, 6.93, 6.72 మీటర్లుగా ఉన్నాయి. బీవీకే కళాశాల దగ్గర 2022లో 5.23 మీటర్లున్న జల మట్టాలు 2023లో 4.27, ప్రస్తుతం 2.48 మీటర్లు, గోపాలపట్నం రైతుబజారు వద్ద 4.56, 6.23, 2.36 మీటర్లలో ఉన్నాయి.

నీటి రీచార్జి విధానం పెరగాలి

- శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జల శాఖ

ఇటీవల కురిసిన వర్షాలతో కొన్నిచోట్ల భూగర్భ జలాలు పెరిగాయి. మరికొన్నిచోట్ల స్థిరంగా ఉన్నాయి. డిసెంబరు నెలలో రోజుల తరబడి ముసురు ఉపయోగపడింది. రానున్న రెండు , మూడు నెలల వరకు భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గుతుంది. ఏప్రిల్ నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తాయి కాబట్టి ఇబ్బంది ఉండదు. కానీ నగరం, పరిసరాల్లో వాడుక నీరు రీచార్జి చేసేలా ఇంకుడు గుంతలు విరివిగా తవ్వాలి. ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటుచేయాలి. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో నీరు ఇంకే పరిస్థితి లేదు.

అధ్వానంగా కలాం పార్కు


పార్కు ప్రాంగణంలో పడి ఉన్న మద్యం సీసాలు


పార్కులో సంచరిస్తున్న పశువులు

- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ప్రాంగణంలో మద్యం సీసాలు
- యథేచ్ఛగా పశువుల సంచారం
- అపరిశుభ్రంగా పరిసరాలు

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో గల అబ్దుల్ కలాం పార్కు అధ్వానంగా తయారవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న ఈ పార్కును ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో అభివృద్ధి చేశారు. చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. బోరుబావి, రెండు గేట్లను కూడా ఏర్పాటు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పార్కు నిర్వహణను గాలికొదిలేశారు. ఈ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన నాయకురాలు ఎన్నికల ప్రచారంలో మాత్రం ఈ పార్కును సర్వాంగసుందరంగా అభివృది చేస్తానంటూ హామీ ఇచ్చారు. ఆ తర్వాత పట్టించుకోలేదు.

అంతేకాకుండా మధ్యలో ఈ పార్కును తీసేసి సచివాలయం నిర్మాణం కూడా చేపట్టేందుకు షాడో కార్పొరేటర్ (కార్పొరేటర్ భర్త) ప్రతిపాదన తీసుకొచ్చారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారితో శంకుస్థాపన కూడా చేయించారు. ఈ విషయమై అప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో పాటు విమర్శలు వెల్లువెత్తడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు.

అంతేకాకుండా అప్పట్లో కోర్టు కూడా పార్కు స్థలాన్ని దుర్వినియోగం చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. దీంతో పార్కులో సచివాలయం నిర్మాణం చేపట్టే అవకాశం లేకుండా పోయింది. అదే సమయంలో పార్కు అభివృద్ధిని కూడా పూర్తిగా విస్మరించారు.

ప్రస్తుతం ఈ పార్కు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా అధ్వానంగా మారిపోయింది. కాస్తోకూస్తో పార్కులా కనిపిస్తుందంటే ఇక్కడ ప్రతి రోజూ ఉదయం పూట షెటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు, కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారుల వల్లేనని స్థానికులు పేర్కొంటున్నారు.

పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో మందుబాబులు, పేకాటరాయుళ్ల, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి స్థావరంగా మారింది. ఇప్పటికే వాకింగ్ ట్రాక్‌లోని చాలా వరకు టైల్స్ పోయాయి. బోరింగ్ వద్ద బురద, పార్కు నిండా మద్యం సీసాలు పేరుకుపోయాయి. స్థానికులు కొందరు పశువులను కట్టారు. దీంతో నిత్యం పశువుల సంచారం ఉంటుంది. ఆట స్థలంలో ఆవుల పేడలు వెరసి పార్కు అంతా అస్తవ్యస్తంగా తయారైంది.


పేడ, చెత్తాచెదారంతో నిండిన పార్కు

ఈ పార్కులో వేడుకలు నిర్వహించుకునేందుకు కొంతమంది పార్కుకు ఒక చోట గోడను విరగొట్టారు. ఇంకో పక్క చిన్న గేటును ఆకతాయిలు విరగొట్టేశారు. ఇక మిగిలినది పెద్ద గేటు. అది కూడా ఉందో లేదో అన్నట్టుగా మిగిలింది. దీంతో అసాంఘిక కార్యకలాలు, ఆవుల సంచారం విచ్చలవిడిగా సాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల

దరఖాస్తులకు గడువు పొడిగింపు

వెంకోజీపాలెం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో 8 మంది స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకానికి న్యాయవాదుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును పొడిగించినట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన ప్రకారం ఈ నెల 6వ తేదీలో గడువు ముగియగా, దీన్ని జనవరి 25 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరి (ఓసీ జనరల్)-4, వెనుకబడిన తరగతి గ్రూపు (ఏ)-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్-1, షెడ్యూల్ తెగలు వారు (ఎస్టీ)-1, వెనుకబడిన తరగతుల వారు గ్రూప్(బి)-1ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో కనీసం 10 సంవత్సరాల మెంబర్‌గా రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. ఆసక్తి గత అభ్యరులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.

తాగునీరు వృథా


చినగదిలిలోని షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో గల ప్రధాన కాలువ లీకేజీతో వృథాగా అవుతున్న తాగునీరు

ఆరిలోవ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల చినగదిలిలోని షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో గల ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పైపులైన్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీంతో రోజూ తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ భూమిలో ఉన్న పైప్ లైన్‌కు ఉన్న జంక్షన్‌లో నీరు విడిచిపెట్టేందుకు ఒక లాకర్ బోల్ట్ ఉంటుంది. దాన్ని పూర్తిగా లూజ్ చేసి నీరు విడిచి పెడతారు. ఇది ప్రతి రోజూ జరిగి ప్రక్రియ. అయితే నీరు సరఫరా సమయం పూర్తయిన తర్వాత ఈ వాల్వ్‌ను సరిగా బిగించకపోవడం వల్లే రోజంత నీరు లీక్ అవుతూ వృథాగా పోతున్నది. నీటి సరఫరా విభాగం కింది స్థాయి నిర్లక్ష్యం కారణంగా రోజూ వేలాది గ్యాలన్ల తాగునీరు వృథాగా పోతున్నది స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు కోదండ రామలీల పరస

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి ప్రక్కన శుక్రవారం సాయంత్రం కోదండరామలీల పరస మహోత్సవం జరుగనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనక రాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడులు చెప్పారు.

ఈ సందర్భంగా రామాలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగనున్నట్టు తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొని పరసను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, వినతులను ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అదికారులు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీకరిస్తారని కమిషనరు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలియజేశారు.

సముద్ర తాబేళ్ల రక్షణకు పటిష్ఠ చర్యలు

అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సముద్రతాబేళ్లు సముద్ర వాతావరణంలో పరిరక్షణకు కీలకపాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. తాబేళ్ల సంరక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. గుడ్లు పెట్టేందుకు వేల కిలోమీటర్ల దూరం పయనించి మన తీరానికి వచ్చే తాబేళ్లు ఇటీవల మృత్యువాత పడుతున్నాయని అన్నారు. సముద్రంలో చేపలవేట కోసం వేసే వలలు, తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో తాబేళ్లు చిక్కుకుని మరణిస్తున్నాయన్నారు. అలాగే తీరానికి వచ్చి పెట్టిన గుడ్లను జంతువులు తినేస్తున్నాయన్నారు. భవిష్యతులో ఆలివ్‌రెడ్ల తాబేళ్లు సంఖ్య తగ్గడం, లేదా అంతరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనికి పరిగణనలో తీసుకుని చేపలవేట చేసే ట్రాల్ నెట్‌లో టెడ్(తాబేళ్లు తప్పించుకునే పరికరం) ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పారబోయకుండా ప్రతిబోటులో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి దాంట్లో సేకరించిన ప్లాస్టిక్‌ను ఒడ్డుకు తీసుకురావాలన్నారు. ఒడిశా తీరంలో సముద్ర తాబేళ్లు వచ్చే ప్రాంతంలో చేపలవేట నిషేధించిందని గుర్తు చేశారు. చేపలవేటకు కోసం బోట్లకు ప్రకాశవంతమైన లైట్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల సముద్రంలో మత్స్యసంపద తగ్గిపోతుందన్నారు. చేపలవేట కోసం లైట్లు వినియోగించవద్దని సూచించారు. సమీక్షలో మత్స్యశాఖ డీడీ లక్ష్మణరావు, అటవీ శాఖ అధికారి శ్రీవాణి, మత్స్య సంస్థల శాస్త్రవేత్తలు డాక్టరు శ్రీధర్, జోయ కిజారుద్దీన్, భామిరెడ్డి, ప్రసాద్,ఇంకా బోటు యజమాను ల సంఘం అధ్యక్షులు వీర్రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


తాబేళ్ల రక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖ, చెర్లపల్లి మధ్య సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, చెర్లపల్లి, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-చెర్లపల్లి-భువనేశ్వర్

08549 నంబరు గల రైలు ఈ నెల 18న (శనివారం) రాత్రి 7.45 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.00 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08550 నంబరు గల రైలు ఈనెల 19న (ఆదివారం) ఉదయం 9.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.30 విశాఖ, మర్నాడు వేకువజాము 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, నాలుగు థర్డ్ ఏసీ, తొమ్మిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ

08509 నంబరు గల రైలు ఈనెల 18న (శనివారం) సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం8.00 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08510 నంబరు గల రైలు ఈనెల 19న ఉదయం 10.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, ఒక థర్డ్ ఏసీ, 11 స్లీపర్, ఏడు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజీ కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ

08551 నంబరు గల రైలు ఈనెల 19న (ఆదివారం) సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08552 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 10.00 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు ఒక సెకెండ్ ఏసీ, ఒక థర్డ్ ఏసీ, 11 స్లీపర్, ఐదు జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని చంద్రనగర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ పరిధిలోని 89వ వార్డు చంద్రనగర్ పరదేశమ్మ ఆలయ సమీపంలో కొత్తోజు మీనాక్షి తన కుమారుడు అజయ్(20)తో కలిసి నివాసం ఉంటున్నారు. క్యాటరింగ్ పనులకు వెళ్లే అజయ్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని తరచూ ఒత్తిడి చేస్తుండేవాడు. పార్వతీపురంలోని బంధువుల ఇంటికి పండగ సందర్భంగా వెళ్లిన మీనాక్షి, గురువారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులను ఎంత కొట్టినా తీయకపోవడంతో పక్కన ఉన్న కిటికీలో నుంచి చూడగా, ఆమె కుమారుడు అజయ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే స్థానికుల సాయంతో ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా అజయ్ మృతి చెందినట్టు గుర్తించారు.ఈ ఘటనపై గోపాలపట్నం పోలీసులకు మీనాక్షి ఫిర్యాదు చేయగా, వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిరిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు రక్షణ కోసం ఈ నెల 19న పాత గాజువాకలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకుడు రెడ్డి వెంకట్రావు కోరారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షలకు ఆయన హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి దేశంలో ఉండే ప్రభుత్వ రంగ పరిశ్రమలు అన్నిటిని ప్రైవేట్‌పరం చేయడానికి కంకణం కట్టుకున్నదని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటంలో భాగంగా ఈ నెల 19న జరిగే పోరాటంలో విశాఖ ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కుమార్ మంగళం, గోపాలకృష్ణ, జగన్నాథం, ఎస్వీ రమణ, జి.అప్పారావు, చలపతి, కుమారి, ఆనంద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 46, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 72, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

పురుగుల మందు తాగి భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి

సీతమ్మధార/ భీమునిపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మొక్కలకు వేసేందుకు తెచ్చిన పురుగుల మందును పొరపాటుగా తాగడంతో భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి చెందాడు. అయితే అక్కాచెల్లెళ్ళకు అప్పు ఇప్పిం చేందుకు ష్యూరిటీ సంతకాలు చేసి, వారు మోసం చేయడంతో ఆవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీతమ్మధార ఆర్ అండ్ బీ క్వార్టర్‌లో ఎం.డి. మస్తాన్ (45) భార్య మహ్మద్ ఫాతీమా, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. మస్తాన్ భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. తన పెద్ద కుమార్తె సుఫీయా పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుండగా, చిన్న కుమార్తె రఫియా ఇంటర్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. మస్తాన్ ఇంటి వద్ద పెంచుకున్న మొక్కలకు మందులు కొట్టడానికి ఈ నెల 14న పురుగుల మందు తెచ్చాడు. మొక్కలు కొట్టే నిమిత్తం అదే రోజు మందును నీటిలో కలిపి పెట్టాడు. రాత్రి అయిపోవడంతో ఉదయం లేచి మొక్కలకు కొట్టమని కుటుంబ సభ్యులు సూచించడంతో మందు కలిసిన గ్లాసును అక్కడే వదిలేశాడు. ఆయనకు ఉదయాన్నే కాకరకాయ రసం తాగడం అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో 15వ తేదీన ఉదయం నిద్ర లేచిన మస్తాన్, ముందు రోజు కలిసిన పురుగుల మందు విషయం మర్చిపోయి గ్లాసులో ఉన్న ద్రావణాన్ని తాగేశాడు. కొంతసేపటి తర్వాత పురుగులు మందు గ్లాసు కనిపించకపోయేసరికి అతడి భార్య ఫాతిమా అడిగింది. అయితే అది కాకరకాయ రసం అని తాను తాగేసినట్టు మస్తాన్ చెప్పాడు. వెంటనే ఫాతిమా తన సోదరుడి సహాయంతో మస్తాన్‌ను సమీపంలో గల ఏఎంజి ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మస్తాన్ బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య ఫాతిమా ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కుటుంబ సభ్యులతో ముస్తాఫా (ఫైల్ ఫొటో)

ష్యూరిటీ సంతకాలు చేసి అప్పు తీర్చలేక..

గత కొంత కాలంగా కలెక్టరేట్ పని చేసిన మస్తాన్ కొద్ది రోజుల క్రితమే భీమిలీ తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా బదిలీ అయ్యాడు. తన అక్కచెల్లెలకు డబ్బులు అప్పు నిమిత్తం కొన్ని రూ.లక్షలకు ష్యూరిటీ సంతకం చేశాడు. అయితే ఆ అప్పు అక్కాచెల్లెళ్లు కట్టకపోవడంతో మస్తాన్ చెల్లించాల్సిన పరిస్థిఇ ఏర్పడింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కొందరు బంధువులు, సహోద్యోగులు అంటున్నారు.

వారం రోజులుగా నిలిచిన ఏపీ ఫైబర్ ప్రసారాలు

రామ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ప్రసారాలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండగ సమయంలో టీవీ ప్రసారాలు నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండగ సెలవుల నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ఉంటాయని, ఇలాంటి సమయంలో ప్రసారాలు నిలిచిపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. రామ్‌నగర్‌తో సహా స్థానికంగా పలు ప్రాంతాల్లో వారం రోజులుగా టీవీ, ఇంటర్‌నెట్ ప్రసారాలు నిలిచిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ నెట్ వర్క్ సరైన నిర్వహణ సామర్థ్యం లేని వారికి అప్పగించడం వల్లే ఇలా తరచూ ప్రసారాలు ఆగిపోతున్నాయని వినియోగదారులు మండి పడుతున్నారు.

వినియోగదారులు అసంతృప్తి

ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తూ ఇలా నెలలో వారాల తరబడి ప్రసారాలు నిలిచిపోవడం ఇబ్బందిగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్య వైఖరి కూడా కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆపరేటర్లు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరతున్నారు.


నితీశ్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా గడ్డపై ఇటీవల జరిగిన క్రికెట్ టెస్ట్ సీరిస్‌లో సెంచరీతో ఆకట్టుకున్న తుంగ్లాం యువకుడు కాకి నితీశ్‌కుమార్‌రెడ్డిని కాలనీ యువకులతోపాటు బీహెచ్‌పీవీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. నగరంలో ఉంటున్న నితీశ్‌ను గురువారం అసోసియేషన్ నాయకులు జె.రాము, ఎం.నానిబాబు, హరిబాబు, అబ్దుల్ రహీం తదితరులు కలిశారు. క్రికెట్‌లో మరింత ప్రతిభ చూపి తుంగ్లాంకు తగిన గుర్తింపు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద గురువారం రెండు కిలోల గంజాయి పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 87 వార్డు పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన ఎలుగుబంటి ఆనంద్ వెంకటకుమార్ అరకులో గుర్తు తెలియని వ్యక్తి వద్ద దంజాయి కొనుగోలు చేసి, పండగ నేపథ్యంలో ఎక్కువ రేటుకు విక్రయించుకోవచ్చని ఊహించ వస్తుండగా తమను చూసి పరుగు తీశాడని చెప్పారు. దీంతో అతన్ని పట్టుకొని విచారించగా గతంలో రెండు కేసుల్లో దువ్వాడలో ముద్దాయిగా ఉన్నట్టు అంగీకరించాడన్నారు. అతన్ని అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏయూలో అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించాలి

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో అన్యాక్రాంతమవుతున్న భూములను పరిరక్షించాలని కోరుతూ ఏయూ రెక్టార్ కిషోర్‌బాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పూర్వ విద్యార్థుల సంక్షేమ సభ్యులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ తక్కువ అద్దెకు ఇచ్చి వర్సిటీ ఆదాయానికి గండి కొడుతున్న రాజారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పలు భూములను ఆక్రమణలకు గురి అవుతున్నాయని, వాటిని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్, కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ శిరీష్‌కుమార్, డాక్టర్ బి.సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇదేం నిర్వాకం!



నక్కవానిపాలెం రోడ్డు మధ్య వదిలేసిన చెట్టు దుంగ

సీతమ్మధార, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో భోగి మంటల్లో వేసిన పెద్ద చెట్టు దుంగను మార్గం మధ్యలో వదిలేశారు. మంటలో వేసిన ఈ దుంగ కాలకపోవడం, వేసిన వారు తొలగించకపోవడతో రహదారికి అడ్డంగా ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. రాత్రి పూట అటుగా ప్రయాణించే వాహనదారులు రోడ్డు మధ్యలో దుంగను గమనించకపోవడంతో చిన్న చిన్న ప్రమాదాలకు గురయ్యారు. భోగి మంటలు వేసినవారు విజ్ఞతతో వ్యవహరించకుండా ఇలా రోడ్డుపై దుంగను వదిలేయడంతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తోంది. దుంగను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

2 నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2, 3 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ కమ్ రాష్ట్ర స్థాయి టోర్నీకి జిల్లా జట్టు ఎంపికలు జరగనున్నాయి. ఏవీఎన్ కాలేజీ బ్యాడ్మింటన్ హాలులో జరిగే ఈ టోర్నీలో 35 ప్లస్ నుంచి 75 ప్లస్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయని సంఘం కార్యదర్శి పల్లా శ్రీనివాస్ తెలిపారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో పాల్గొనేవారు ఈనెల 30లోగా ఎంట్రీలు పొందాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 93477 89831, 94403 67158లో సంప్రదించాలన్నారు.

కూడళ్లలో కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్

» ఇష్టానుసారంగా రాకపోకలు » తరచూ ప్రమాదాలు » ఆచూకీ లేని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద పని చేయని సూచికలు

డాబాగార్డెన్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా ఉన్నాయి. సరస్వతీ పార్కు, డాబాగార్డెన్స్ జంక్షన్, డాబాగార్డెన్స్ ఎల్ఐసీ అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాల్లో ఒక్క చోటైనా.. దీపాలు వెలగకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అసలే సంక్రాంతి పండుగ సీజన్ కావడంతో.. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనదారులు అంబేడ్కర్ సర్కిల్, డాబాగార్డెన్స్, సరస్వతీ పార్కు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నలువైపులా కూడళ్ల ఉండటంతో పాటు ఎవరికి వారు ఇష్టానుసారంగా ఒకేసారి వచ్చేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ముఖ్యమైన ప్రాంతాల్లో కనీసం ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా లేకపోవడంతో సమస్య జటిలంగా తయారైంది. ముఖ్యమైన కూడళ్ల వద్ద ఫుట్‌పాత్‌లపై కొందరు వ్యాపారాలు చేస్తుండడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. ఇటీవల సరస్వతీ జంక్షన్ వద్ద రెండు ప్రమాదాలు జరగడంతో వాహనదారులు కింద పడిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయమేస్తోంది..

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేయకపోవడంతో భారీ వాహనం వెనుక వెళ్లాల్సినప్పుడు ఒక్కసారిగా వేగ నియంత్రణ చేయాలంటే కష్టతరంగా ఉంటోంది. అదే ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలుగుతూ ఉంటే దూరం నుంచే వాటిని గమనించి ఆగేందుకు అవకాశం కలుగుతుంది. తక్షణమే వీటిని వినియోగంలోకి తీసుకురావాలి. -రాజా, వాహనదారుడు

రెండుసార్లు ప్రమాదాలు చూశా

సెంటర్‌పాయింట్ జంక్షన్‌లో ప్రమాదాలు నా కళ్లెదుటే రెండుసార్లు చోటుచేసుకున్నాయి. కనీసం ఆయా ప్రాంతాల్లో ఒక్క కానిస్టేబుల్ కూడా లేరు. ఉన్నతాధికారులు సరైన పర్యవేక్షణ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించాలి. లేకుంటే మహిళలు బయటకు వచ్చే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. -సౌమ్య, వాహనచోదకురాలు

రోడ్డును ఆక్రమించి పశువుల పెంపకం

80 ఫీట్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డుపైనే పశువులను కట్టిన దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో పశువులను కట్టి వేయడంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును సగానికి పైగా ఆక్రమించి పశువులను కట్టి మేపుతుండడంతో చాలా మంది మండిపడుతున్నారు. వీటిని పెంచడం వల్ల అక్కడే ఆవులు మల, మూత్ర విసర్జనం చేస్తుండడంతో రోడ్డంతా అధ్వానంగా తయారవుతోందని స్థానికులు వాపోతున్నారు.

జీవీఎంసీ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు కొందరు ఇలా పశువుల పెంపకానికి వినియోగిస్తుండడం, రోడ్డు అపరిశుభ్రంగా తయారవుతుండడంతో అటు వైపుగా రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన కూడా సమస్యగా మారుతోందని అంటున్నారు. ఇలా దర్జాగా రోడ్డుపై ఆవులను కట్టి మేపుతుంటే, అధికారులెవరూ పట్టించుకోకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించి మేపుతున్న ఆవుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతుకుల రోడ్లకు మోక్షం



ఆర్టీఏ కార్యాలయం రోడ్డులో గతుకులను పూడ్చుతున్న సిబ్బంది

మురళీనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలో పరిధి రోడ్లకు గతుకుల నుంచి మోక్షం లభించింది. ఇటు నియోజకవర్గ బోర్డరుగా ఉన్న 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ అంబేడ్కర్ కాలనీ నుంచి అటు సీతమ్మధార వరకు రోడ్డు మధ్య ఉన్న గతుకులను పూడ్చుతూ పనులు చేపట్టారు. జీవీఎంసీ కాంట్రాక్టు ప్రాతిపదికన ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో గతుకులను ప్యాచ్ వర్క్‌లతో సరిదిద్దారు. కొన్నేళ్లుగా ఉన్న ఈ గతుకులదారుల్ని అధికార ఎన్డీఏ ప్రభుత్వ ఆదేశాలతో తక్షణ మరమ్మతులు చేపట్టారు.

జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ ఆర్టీఏ దారిలో నీటి పైపులైన్ల మరమ్మతుల కోసం చేపట్టిన తర్వాత తవ్విన రోడ్డును నాలుగేళ్లుగా అలాగే వదిలేశారు. ఇపుడు ఈ దారికి తారు రోడ్డు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. పోర్టు క్వార్టర్సు దారిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డివైడర్లు వేసి మార్కర్లు వేశారు. గ్రేటర్ విశాఖ 49వ వార్డు బర్మాక్యాంపు రోడ్డు, మాధవధార జంక్షన్, మురళీనగర్ సెక్టారు దారుల్లో ఏర్పడిన యూజీడీ, నీటి పైపులైన్ల మరమ్మతుల తవ్వకాల దారులను నవీకరించడంతో ప్రయాణికులకు ఊరట లభిస్తోంది.

హామీ ఇస్తే నెరవేర్చేది కూటమి ప్రభుత్వం

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఆంధ్రజ్యోతి 16 (ఆంధ్రజ్యోతి) : మాటిస్తే చేసి చూపించే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు'ను పటిష్ఠంగా నిలబెట్టే చర్య అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.10,300 కోట్లు ఆర్థిక ప్యాకేజీ దిశగా అడుగులు పడడం ఆనందకరమన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయనుందన్నారు. విశాఖ ఉక్కు కోసం ఆలోచన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, యువగళంలో మాటిచ్చి నిలబెట్టిన నారా లోకేష్, స్టీల్‌ప్లాంట్‌లో సభ పెట్టి భరోసా నిచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర వాసులు తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

రహదారుల నిర్మాణంపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఒకరిని కలిపి హై పవర్ కమిటీ వేశారు. వీరంతా కలిసి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) తయారుచేస్తారు. అందులోనే నిర్మాణ వ్యయం, దానిపై ఏయే మార్గాల్లో ఎంతెంత ఆదాయం వస్తుందో ఒక అంచనా రూపొందిస్తారు.

తొలుత అత్యంత ప్రధానమైన రహదారిని నిర్మిస్తారు. దానిపై వచ్చే ఆదాయం చూసి, బాగుందంటే...ఆ తరహాలో మరో రహదారి నిర్మాణం చేపడతారు. ఇలా ఒకదాని తరువాత మరొకటి నిర్మాణం చేసుకుంటూ వెళతారు.

తెగ తాగారు

... 5వ పేజీ తరువాయి

గ్రామీణ వాతావరణం ఎక్కువగా ఉండే పెందుర్తి, గాజువాక, గోపాలపట్నం, భీమిలి వంటి ప్రాంతాల్లో పెరిగాయి. భీమిలి సర్కిల్‌లోని 32 దుకాణాలు, పెందుర్తి సర్కిల్‌లోని 36 దుకాణాలు, గాజువాక సర్కిల్‌లోని 33 దుకాణాలు, గోపాలపట్నం సర్కిల్‌లోని 14 దుకాణాల్లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మొత్తమ్మీద జిలావ్యాప్తంగా మద్యం విక్రయాలను పరిశీలిస్తే సాధారణ రోజుల్లో కంటే దాదాపుగా రెట్టింపు విక్రయించినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504), హటియా-బెంగుళూరు (12835), కామాఖ్య-బెంగళూరు (12552) వంటి పలు వారాంతపు రైళ్లకు మార్చి ఎనిమిదో తేదీ వరకూ డిమాండ్ ఏర్పడి దాదాపు బెర్తులు నిండిపోయాయి.

హౌరా రైళ్లకు నెలాఖరు వరకు డిమాండ్

హౌరా వెళ్లే కోరమండల్ (12842), మెయిల్ (12840), ఈస్ట్ కోస్ట్ (18046), ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12704) వంటి రెగ్యులర్ రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది.

శని, ఆదివారం రిగ్రెట్

ప్రయాణికుల సంఖ్య గణనీయంగా ఉన్న నేపథ్యంలో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే పలు రైళ్లకు శని, ఆదివారాల్లో రిగ్రెట్ (నో రూమ్) ఏర్పడింది. దీంతో రిజర్వేషన్ పొందనివారు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆరోగ్య శాఖలో ఇ-పాలన

... 5వ పేజీ తరువాయి

ఫైల్ నడపాలని అన్ని సెక్షన్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు సూచించారు. 48 గంటలకు మించి ఫైలు ఆయా సెక్షన్లలో పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమ్స్, ఘోషా, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ఈఎన్‌టీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి సూపరింటెండెంట్లు కూడా సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

వేగవంతానికి అవకాశం

ఇ-పాలనతో ఫైళ్లు వేగంగా కదిలే అవకాశం ఉంటుంది. రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టడానికి అవకాశం ఉండదు. పెండింగ్‌లో పెట్టాలంటే స్పష్టమైన కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ప్రజలు, సిబ్బందికి మేలు జరుగుతుంది. అయితే గతంలో కూడా ప్రభుత్వాలు ఇ-పాలన అమలుకు ఆదేశాలిచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఇబ్బందులు ఎదురవ్వడంతో ప్రక్రియ ముందుకు వెళ్లలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అన్ని శాఖల్లో అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా ఇందులో ఆరోగ్య శాఖ ముందుందని సమాచారం.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

బృందాలకు ఆదేశించామన్నారు. తహసీల్దార్, మండల సర్వేయర్ కలిసి గ్రామ, బ్లాక్ సరిహద్దులతోపాటు, ప్రభుత్వ భూమి, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూములు, రైతులకు చెందిన భూముల రీసర్వేకు షెడ్యూల్ రూపొందిస్తారని అన్నారు. రీసర్వే కోసం రైతులు, ఇతర భూ యజమానులకు ముందుగా నోటీసులు అందజేస్తామని, ఆర్డీవో నేతృత్వంలో గ్రామాల్లో సభలు నిర్వహించి రీసర్వే ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. రైతులు, అధికారులతో కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి రీసర్వే చేయనున్న తేదీలు పొందుపరుస్తామన్నారు.

జిల్లాలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారం పక్కాగా జరిగిందా?, లేదా?....అనేది పరిశీలించడానికి జాతీయ రహదారుల విభాగం ఎన్డీసీ నేతృత్వంలో ఒక ఆడిట్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ టీమ్‌లో ప్రతి శాఖకు చెందిన అధికారి ఉంటారన్నారు. అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చేయాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోందన్నారు. భూములకు సంబంధించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కంటే రెవెన్యూ సదస్సుల్లోనే ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల కోసం వచ్చే అర్జీలను పరిశీలించి పక్కాగా డాక్యుమెంట్లు ఉంటే వెంటనే తహసీల్దారు జారీచేస్తారన్నారు. ఏమైనా తేడా ఉంటే జిల్లా రెవెన్యూ అధికారి వద్ద అప్పీల్‌కు వెళితే ఆయన పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదల నుంచి అర్జీలు వచ్చాయని, వాటిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేసీ అన్నారు.

చినుకు రాలినా...ఛ్ఛే!

... 5వ పేజీ తరువాయి

నెలాఖరుకు 10 మీటర్లు, అంతకంటే తక్కువకు పడిపోవడం, కొన్నిచోట్ల పెరుగుదల కనిపించింది. నగరంలో విచ్చలవిడిగా భూగర్భ జలాల వినియోగం సాగడంతో వచ్చే వేసవిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరించారు.

గ్రామీణంలో పెరుగుదల

ఆనందపురం మండలం శొంఠ్యాంలో డిసెంబరుకు సంబంధించి 2022లో 8.09 మీటర్లున్న భూగర్భ జల మట్టాలు 2023లో 5.1 మీటర్లు, ఈ ఏడాది 4.21 మీటర్లుగా నమోదయ్యాయి. భీమిలి మండలం చిప్పాడలో 2022లో 5.13 మీటర్లుండగా, ఈ ఏడాది 1.99, పెందుర్తి మండలం నరవలో 2022లో 5.13 మీటర్లు, ప్రస్తుతం 1.25, ఎంపీడీవో కార్యాలయం వద్ద 8.09 మీటర్లుండగా ప్రస్తుతం 7.19 మీటర్లలో ఉన్నాయి. కాగా గ్రామీణ ప్రాంతంలో జనావాసాలు ఎక్కువగా ఉన్నచోట, అభివృద్ధి జరిగే ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. భీమిలిలో ఏపీ గురుకులం వద్ద 2022లో 5.13 మీటర్లు ఉండగా ప్రస్తుతం 7.39 మీటర్లకు పడిపోయింది. నగరంలో అనేక చోట్ల డిసెంబరులో భారీగా జలమట్టాలు పడిపోయాయి. గాజువాక కణితి కాలనీలో 2022లో 4.56 మీటర్లుండగా గత ఏడాది 10.27కు, ప్రస్తుతం 11.23 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద 2022లో 5.13 మీటర్లున్న భూగర్భ మట్టాలు గత ఏడాది 14.22కు, ఈ నెలలో 12.65కు, మారికవలస బిస్లరీ యూనిట్ వద్ద వరుసగా 5.13, 10.44, 9.45, మధురవాడ ఆస్పత్రి వద్ద 2022లో 5.23 ఉండగా, గత ఏడాది 13.73, ప్రస్తుతం 11.89 మీటర్లకు పడిపోయింది. నగరంలో సెంట్రల్ పార్కు వద్ద 2022లో 3.76 మీటర్లు ఉండగా, 2023లో 13.63, ప్రస్తుతం 13 మీటర్లు, ఏయూ యోగా విలేజ్ వద్ద 6.36, 6.93, 6.72 మీటర్లుగా ఉన్నాయి. బీవీకే కళాశాల దగ్గర 2022లో 5.23 మీటర్లున్న జల మట్టాలు 2023లో 4.27, ప్రస్తుతం 2.48 మీటర్లు, గోపాలపట్నం రైతుబజారు వద్ద 4.56, 6.23, 2.36 మీటర్లలో ఉన్నాయి.

నీటి రీచార్జి విధానం పెరగాలి

ఇటీవల కురిసిన వర్షాలతో కొన్నిచోట్ల భూగర్భ జలాలు పెరిగాయి. మరికొన్నిచోట్ల స్థిరంగా ఉన్నాయి. డిసెంబరు నెలలో రోజుల తరబడి ముసురు ఉపయోగపడింది. రానున్న రెండు, మూడు నెలల వరకు భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గుతుంది. ఏప్రిల్ నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తాయి కాబట్టి ఇబ్బంది ఉండదు. కానీ నగరం, పరిసరాల్లో వాడుక నీరు రీచార్జి చేసేలా ఇంకుడు గుంతలు విరివిగా తవ్వాలి. ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటుచేయాలి. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో నీరు ఇంకే పరిస్థితి లేదు.

- శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జల శాఖ

స్టీల్‌ప్లాంటుకు నిధుల కేటాయింపుపై హర్షం

డాబాగార్డెన్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు పునరుద్ధరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.10,300 కోట్లు కేటాయించడం ఆనందం కలిగించే అంశమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ఒక పరిశ్రమ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. స్పెషల్ ప్యాకేజీ కేటాయించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకం..

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నుంచి బయటపడిందన్న సంకేతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ప్లాంట్ నిర్వహణకు 10,300 కోట్ల ప్యాకేజీ ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. ప్రధానిని ఒప్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చూపించిన చొరవ మరలేనిదని తెలిపారు.

బాబోయ్ దుర్వాసన



కనకమ్మవారి వీధిలో రోడ్డుపై చెత్త

సీతమ్మధార, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 23వ వార్డు చైతన్యనగర్ కనకమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి కూడలిలో యూజీడీ నుంచి మురుగు నీరు పొంగి పారుతోంది. కూడలిలో విద్యుత్ స్తంభం వద్ద స్థానికులు వేసిన చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా రాకపోకలు సాగించేవారు బురద నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బాబోయ్ కంపు! అంటూ స్థానికులు ముక్కున వేలేసుకుని వెళ్తున్నారు. అధికారుల స్పందించి పేరుకుపోయిన చెత్తను, యూజీడీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్ణా మార్కెట్‌లో రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం

జగదాంబ కూడలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్ ప్రాంతంలో కొందరు రేషన్ డీలర్ల అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది, పేదల బియ్యాన్ని దుకాణాల్లో అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పూర్ణా మార్కెట్‌లోని పండావీధి, ఆయిల్ మిల్ వద్ద 153 రేషన్ దుకాణంలో వన్ టౌన్ పోలీసులు, పౌర సరఫరా శాఖ అధికారుల దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడింది. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ దేముడుబాబు తెలిపిన వివరాలు మేరకు.. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు పండా వీధి ఆయిల్ మిల్లు సందులో ఉన్న రేషన్ దుకాణంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారు. డీలర్ వద్ద 44 బియ్యం బస్తాలు ఉండాల్సి ఉండగా, అదనంగా 129 బస్తాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే రేషన్ దుకాణం ఎదురుగా ఒక మినీ వ్యాన్‌లో 14 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేయగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో బియ్యం తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో పట్టుబడిన వ్యక్తులను అధికారులు విచారించగా, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అంగీకరించారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వెంకటేశ్వరరావు పేరుతో ఉన్న ఆ దుకాణాన్ని పౌర సరఫరాశాఖ అధికారులు రద్దు చేశారు.

నవోదయ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు

మహారాణిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 18న జరిగే ప్రవేశపరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 11.30 నుంచి 1 వరకు జరిగే ఈ పరీక్షకు 9080 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు.

అతిసార నివారణపై అవగాహన అవసరం

మహారాణిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అతిసారాపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సి. సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్ జంక్షన్‌లోని సమావేశ మందిరంలో పిల్లల్లో అతిసార వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జరిగిన సదస్సులో మాట్లాడారు.

ఈ బైక్ ఎవరిదో..?



మర్రిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మర్రిపాలెం ప్రధాన రహదారి మూడు రోడ్ల జంక్షన్ వద్ద పది రోజులుగా ఒక బైక్ పార్క్ చేసి ఉంది. దీన్ని ఎవరు ఎందుకు ఇక్కడ పార్క్ చేశారో తెలియడం లేదు. ఎవరైనా దొంగలించి ఇక్కడ వదిలేశారా లేదా మరే ఇతర కారణం ఉందా అని స్థానికులు అను మానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ విషయమై స్పందించాలని పలువురు కోరుతు న్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

అల్లిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురంలో నేరెళ్లకొనేరు ప్రాంతానికి చెందిన ఈళ్ల తులసీరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ముందుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తులసీరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేరి, కనక, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజాధిరాజా అలంకరణలో అప్పన్నస్వామి

సింహాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు గురువారం రాజాధిరాజా అలంకరణలో దర్శనమిచ్చారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం రాజభోగం, పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాలుపై కాలు వేసుకున్న రాజాధిరాజుగా అలంకరించి, మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం



అభ్యర్థుల పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 280 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఆర్ఐలు ఎల్. మన్మధరావు, బి. రామకృష్ణారావు, ఐటీ కోర్ ఎస్ఐ బి. సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు కార్యాలయం.. సందడి శూన్యం!

అధికారులు, ఉద్యోగుల హాజరు అంతంతమాత్రం

కానరాని ప్రజలు.. బోసిపోయిన కార్యాలయాలు

నిత్యం రద్దీగా కనిపించే ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి. గురువారం పని దినమైనప్పటికీ అధికారులు, ఉద్యోగులు అంతంతమాత్రంగానే హాజరుకావడంతో కళ తప్పాయి. అలాగే సమస్యలను విన్నవించుకోవడానికి ప్రజలు కూడా రాకపోవడంతో ఖాళీగా కనిపించాయి.





అధికారులు, ఉద్యోగులు, ప్రజలు లే(రా)క బోసిబోయిన జీవీఎంసీ జోనల్ కార్యాలయం.. ఖాళీగా ఉన్న కుర్చీలు

గాజువాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని జోనల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఎప్పుడూ సందడిగా ఉంటాయి. నిత్యం వివిధ పనులపై వచ్చే ప్రజలు పండగ రోజులు కావడంతో ఎక్కడా కనిపించలేదు. ప్రధానంగా పండగ సందర్భంగా ఉద్యోగులు ఉండరని భావించిన ప్రజలు ఇటుగా కన్నెత్తి కూడా చూడలేదు. అధికారులు, ఉద్యోగులు కూడా అంతంతమాత్రంగానే వచ్చారు. దీంతో వారి కుర్చీలతో పాటు ఫిర్యాదుదారుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు కూడా ఖాళీగా కనిపించాయి. శుక్ర, శనివారాల్లో కూడా ఇదే పరిస్థితి తప్పేలా లేదు. ఇదిలా ఉండగా గాజువాకలోని వివిధ ప్రాంతాల వారు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పండగకు ఊరు వెళ్ల లేని వారంతా తిండికి ఇబ్బందులు పడ్డారు. వసతిగృహాలు, క్యాంటిన్‌లు మూసివేయటం, ఆపై హోటళ్లు కూడా మూసివేయ టంతో వారికి అగచాట్లు తప్పడం లేదు.

వేగం కాదు.. సురక్షిత ప్రయాణమే లక్ష్యం

ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకా బస్ స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేగం కాదని, సురక్షిత ప్రయాణమే సంస్థ లక్ష్యమని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. గురువారం నిర్వహించిన భద్రతా మాసోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ విశాఖ జోన్‌లో గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాలు నాలుగు శాతం తగ్గాయని చెప్పారు. జీరో ఆక్సిడెంట్ జోన్‌గా విశాఖను తీర్చిదిద్దేందుకు సిబ్బంది ఐకమత్యంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు గంగాధర్, అరుణకుమారి, సుధాకర్, సిబ్బంది రామకృష్ణ, ఉజ్వల, మాధురి ,హిమబిందు, ఈశ్వరరావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఆర్ఎం బి.అప్పల నాయుడు

ట్రాఫిక్‌పై డ్రైవర్లకు అవగాహన

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్‌పై గురువారం డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేశ్వరరావు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు.

మల్కాపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు. డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వేగంగా బస్సు నడపడం ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. బస్సును డిపో నుంచి తీసినప్పుడు కండిషన్ చెక్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎం ప్రవీణా, మెకానికల్ చీఫ్ దుర్గాప్రసాద్, ఆర్టీసీ ట్రాఫిక్ సీఐ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త వేస్తే జరిమానా

» జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము

మల్కాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రహదారులపై చెత్త వేసిన వారికి అపరాధ రుసుం విధించాలని జీవీఎంసీ జోన్ -5 కమిషనర్ రాము స్పష్టం చేశారు. 60వ వార్డు పరిధిలో గురువారం ఆయన పర్యటించారు. రోడ్డుపై చెత్త ఉండడం చూసి పారిశుధ్య సిబ్బందిని నిలదీశారు. రోడ్డు మీద చెత్తవేసిన వారిని గుర్తించి అపరాధ రుసుం వేయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త వాహనానికి ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో సచివాలయ శానటరీ సెక్రటరీలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. అలాగే ఓ బోరు మరమ్మతుకు గురైందని ఫిర్యాదు వచ్చి నెల రోజులైనా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే బోరును వినియోగంలోకి తీసకొచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రచయిత కరుకు సత్తిరాజు మృతి

మల్కాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం జలారవీధికి చెందిన ప్రముఖ రచయిత కరుకు సత్తిరాజు బుధవారం గుండెనొప్పితో మృతి చెందారు. కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండగను జరుపుకున్నారు. కనుమకు సిద్ధం అవుతుండగా మంగళవారం రాత్రి గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయిస్తుండగా మరణించారు. మల్కాపురం శ్మశనవాటికలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖ ట్రస్టులో ఉద్యోగానికి పదవీ విరమణ పొందారు. ఆయనకు రచనలపై ఉన్న కోరికతో దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రధానంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో యువతారనికి, విద్యార్థులకుపలుమార్లు అవగహన కల్పించే కార్యక్రమాలను చేపట్టారు.



సత్తిరాజు (ఫైల్)

మహిళా కానిస్టేబుల్ సెల్‌ఫోన్ చోరీ

కూర్మన్నపాలెం,జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీసు స్టేషన్‌లో మంగళవారం మహిళా కానిస్టేబుల్ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. స్టేషన్ ఆవరణలో కానిస్టేబుల్ ముగ్గులు వేస్తుండగా వడ్లపూడికి చెందిన వ్యక్తి ఉమ్మి వేశాడు. ఎందుకిలా చేశావని, అలా చేయకూడదని చెప్పి మరలా ముగ్గు వేసే క్రమంలో, మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తి ఆమె సెల్‌ఫోన్ తీసుకొని ఉడాయించాడు. ముగ్గు పూర్తయ్యాక సెల్‌ఫోన్ కనబడకపోవడంతో సీసీ కెమెరాలో చూడగా, ఆ వ్యక్తి తస్కరించినట్టు గ్రహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద గురువారం రెండు కిలోల గంజాయి పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 87 వార్డు పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన ఎలుగుబంటి ఆనంద్ వెంకటకుమార్ అరకులో గుర్తు తెలియని వ్యక్తి వద్ద దంజాయి కొనుగోలు చేసి, పండగ నేపథ్యంలో ఎక్కువ రేటుకు విక్రయించుకోవచ్చని ఊహించ వస్తుండగా తమను చూసి పరుగు తీశాడని చెప్పారు. దీంతో అతన్ని పట్టుకొని విచారించగా గతంలో రెండు కేసుల్లో దువ్వాడలో ముద్దాయిగా ఉన్నట్టు అంగీకరించాడన్నారు. ఈ మేరకు అతన్ని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు పందెం రాయుళ్లపై కేసు

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 86 వార్డు కూర్మన్నపాలెంలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి మూడు కోడి పుంజులును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొత్త అల్లుడికి 153 రకాలతో విందు భోజనం

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త అల్లుడికి జీవితాంతం గుర్తుండేలా యోనతతో కనుమ, ముక్కనుమలలో 153 రకాల విందు భోజనాన్ని విస్తరిలో ఏర్పాటు చేశారు. ఇటువంటి విడ్డూరాలు సహజంగా గోదారి జిల్లాల్లో ఉంటాయి. ఆ సంస్కృతి విశాఖ జిల్లాకు కూడా వ్యాపించింది. దీంతో పరిసర కాలనీల మహిళలు ఆ వింతను చూడ్డానికి తరలివచ్చారు. జీవీఎంసీ 87 వార్డు పరిధిలోని కణితిలో నివాసం ఉంటున్న ఉక్కు ఉద్యోగి శివకుమార్ తన కూతురు డిల్లీశ్వరికి అల్లుడు వెంకట అజయ్‌తో వివాహం జరిపించారు. తొలి సంక్రాంతి ఎప్పుడూ గుర్తుండిపోయేలా అల్లుడు, కోడళ్లకు 153 రకాలతో వంటకాలు తయారు చేశారు. వాటిని విస్తరలో పెట్టి నూతన దంపతులకు అందించారు.



కణితిలో కొత్త అల్లుడికి 153 రకాలతో ఏర్పాటుచేసిన విందు భోజనం

యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌కు సత్కారం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా గడ్డపై ఇటీవల జరిగిన క్రికెట్ టెస్ట్ సీరిస్‌లో సెంచరీతో ఆకట్టుకున్న తుంగ్లాం యువకుడు కాకి నితీశ్‌కు మార్‌రెడ్డిని కాలనీ యువకులతో పాటు బీహెచ్‌పీవీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. నగరంలో ఉంటున్న నితీశ్‌ను గురువారం అసోసియేషన్ నాయకులు జె.రాము, ఎం.నానిబాబు, హరిబాబు, అబ్దుల్ రహీం తదితరులు కలసి సన్మానం చేశారు. క్రికెట్‌లో మరింత ప్రతిభ చూపి తుంగ్లాంకు తగిన గుర్తింపు తీసుకురాలని ఈ సందర్భంగా వారు కోరారు.



క్రికెటర్ నితీశ్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

సౌత్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో అలేఖ్యకు సిల్వర్ మెడల్

సింధియా, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరిలో ఇటీవల జరిగిన ఒకటో సబ్ జూనియర్ సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో సింధియాలోని షిప్‌యార్డ్ ఓల్డ్ కాలనీకి ప్రాంతానికి చెందిన వడ్డాది అలేఖ్య ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో ఆమె సిల్వర్ మెడల్ సాధించింది. తన ప్రత్యర్థితో తలపడే సమయంలో కంటిపై స్వల్ప గాయమైనా తుదివరకూ పోరాడి పతకం సాధించింది. ఈ మేరకు అలేఖ్యకు ద్రోణాచారి అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, కోచ్ రమ్య, అమరానథ్ కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.



సిల్వర్ మెడల్ సాధించిన అలేఖ్య

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

గాజువాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బడగు, బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలు నమోదు కావటంతో గాజువాక పార్టీ కార్యాలయంలో గురువారం కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని సభ్యత్వాలు తెలుగుదేశం పార్టీకి ఉన్నట్టు చెప్పారు. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. పార్టీ సభ్యత్వంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిన విజయ్‌కుమార్, శివప్రసాదరావు, పోతిన వెంకటేశ్వరరావు, అంగ కృష్ణ, నమ్మి సింహాద్రి, లక్ష్మణరావు, బొంగు రాజు, శ్రీను పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రనగర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ అప్పారావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ పరిధిలోని 89వ వార్డు చంద్రనగర్ పరదేశమ్మ ఆలయ సమీపంలో కొత్తోజు మీనాక్షి, కుమారుడు అజయ్ (20)తో కలిసి నివాసం ఉంటున్నారు. క్యాటరింగ్ పనులకు వెళ్లే అజయ్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని ఒత్తిడి చేసేవాడు. పార్వతీపురంలోని బంధువుల ఇంటికి పండగ సందర్భంగా వెళ్లిన మీనాక్షి, గురువారం ఇంటికి చేరుకుని తలుపులు ఎంత కొట్టినా తీయలేదు. దీంతో పక్కన ఉన్న కిటికీలో నుంచి చూడగా, ఆమె కుమారుడు అజయ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి స్థానికుల సాయంతో లోపలికి వెళ్లి చూడగా అజయ్ మృతి చెందినట్టు గుర్తించారు. మీనాక్షి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి

సీతమ్మధార/భీమునిపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మొక్కలకు వేసేందుకు తెచ్చిన పురుగుల మందును పొరపాటుగా తాగడంతో భీమిలి తహసీల్దార్ కార్యాలయం అటెండర్ మృతి చెందాడు. అయితే అక్కాచెల్లెళ్లకు అప్పు ఇప్పిం చేందుకు ష్యూరిటీ సంతకాలు చేసి, వారు మోసం చేయడంతో ఆవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీతమ్మధార ఆర్ అండ్ బీ క్వార్టర్‌లో ఎం.డి. మస్తాన్ (45) భార్య మహ్మద్ ఫాతీమా, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. మస్తాన్ భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. తన పెద్ద కుమార్తె సుఫీయా పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుండగా, చిన్న కుమార్తె రఫియా ఇంటర్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. మస్తాన్ ఇంటి వద్ద పెంచుకున్న మొక్కలకు మందులు కొట్టడానికి ఈ నెల 14న పురుగుల మందు తెచ్చాడు. మొక్కలు కొట్టే నిమిత్తం అదే రోజు మందును నీటిలో కలిపి పెట్టాడు. రాత్రి అయిపోవడంతో ఉదయం లేచి మొక్కలకు కొట్టమని కుటుంబ సభ్యులు సూచించడంతో మందు కలిసిన గ్లాసును అక్కడే వదిలేశాడు. ఆయనకు ఉదయాన్నే కాకరకాయ రసం తాగడం అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో 15వ తేదీన ఉదయం నిద్ర లేచిన మస్తాన్, ముందు రోజు కలిసిన పురుగుల మందు విషయం మర్చిపోయి గ్లాసులో ఉన్న ద్రావణాన్ని తాగేశాడు. కొంతసేపటి తర్వాత పురుగులు మందు గ్లాసు కనిపించకపోయేసరికి అతడి భార్య ఫాతిమా అడిగింది. అయితే అది కాకరకాయ రసం అని తాను తాగేసినట్టు మస్తాన్ చెప్పాడు. వెంటనే ఫాతిమా తన సోదరుడి సహాయంతో మస్తాన్‌ను సమీపంలో గల ఏఎంజి ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మస్తాన్ బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య ఫాతిమా ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కుటుంబ సభ్యులతో ముస్తాఫా (ఫైల్ ఫోటో)

ష్యూరిటీ సంతకాలు చేసి అప్పు తీర్చలేక..

గత కొంత కాలంగా కలెక్టరేట్ పని చేసిన మస్తాన్ కొద్ది రోజుల క్రితమే భీమిలీ తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా బదిలీ అయ్యాడు. తన అక్కచెల్లెలకు డబ్బులు అప్పు నిమిత్తం కొన్ని రూ.లక్షలకు ష్యూరిటీ సంతకం చేశాడు. అయితే ఆ అప్పు అక్కాచెల్లెళ్లు కట్టకపోవడంతో మస్తాన్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కొందరు బంధువులు, సహోద్యోగులు అంటున్నారు.

సముద్ర తాబేళ్ల రక్షణకు పటిష్ఠ చర్యలు

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్ల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తాబేళ్ల సంరక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. సముద్రంలో చేపల వేట కోసం వేసే వలలు, తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో తాబేళ్లు చిక్కుకుని మరణిస్తున్నాయన్నారు. భవిష్యతులో ఆలివ్ రెడ్లీ తాబేళ్లు సంఖ్య తగ్గడం, లేదా అంతరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనికి పరిగణనలో తీసుకుని చేపలవేట చేసే ట్రాల్ నెట్‌లో టెడ్ (తాబేళ్లు తప్పించుకునే పరికరం) ఏర్పాటు చేయాలని సూచించారు. ఒడిశా తీరంలో సముద్ర తాబేళ్లు వచ్చే ప్రాంతంలో చేపలవేట నిషేధించిందని గుర్తు చేశారు. చేపల వేటకు కోసం బోట్లకు ప్రకాశవంతమైన లైట్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల సముద్రంలో మత్స్య సంపద తగ్గిపోతున్నదని చెప్పారు. సమీక్షలో మత్స్య శాఖ డీడీ లక్ష్మణరావు, అటవీ శాఖ అధికారి శ్రీవాణి, మత్స్య సంస్థల శాస్త్రవేత్తలు డాక్టరు శ్రీధర్, జోయ కిజారుద్దీన్, భామిరెడ్డి, ప్రసాద్, బోటు యజమానుల సంఘం ప్రతినిధులు వీర్రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల

దరఖాస్తుకు గడువు పెంపు

వెంకోజీపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో 8 మంది స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకానికి న్యాయవాదుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును పొడిగించినట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన ప్రకారం ఈ నెల 6వ తేదీలో గడువు ముగియగా, దీన్ని జనవరి 25 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరి (ఓసీ జనరల్)-4, వెనుకబడిన తరగతి గ్రూపు (ఏ)-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్-1, షెడ్యూల్ తెగలు వారు (ఎస్టీ)-1, వెనుకబడిన తరగతుల వారు గ్రూప్(బి)-1ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో కనీసం 10 సంవత్సరాల మెంబర్‌గా రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. ఆసక్తిగత అభ్యర్థులు జీవీఎంసీ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.

'పేదల పెన్నిధి ఎన్టీఆర్'

కూర్మన్నపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలపేద పెన్నిధిగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిలిచిపోయారని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని జీవీఎంసీ 87వ వార్డులో నిర్వహించిన క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయరామరాజు, ఎం.రాము, బి.రాజన్‌రాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది)48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 40,క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 72, దేముడుచిక్కుడు 66, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళీ 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 46, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ఇంటర్వ్యూ..

నెలాఖరులోగా అర్జీలను పరిష్కరిస్తాం

-ఆనంద్‌కుమార్, తహసీల్దార్



మండల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదసుల్లో 1251 అర్జీలు అందాయి. వీటిలో 469 పరిష్కరించాం. పెండింగ్ అర్జీలను విభజించి ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తాం. పౌర సేవల్లో జాప్యాన్ని సహించం

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఎంతవరకు పరిష్కరించారు?

జవాబు: మండల రెవెన్యూ పరిధిలోని 23 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 1251 అర్జీలు అందాయి. వీటిలో 469 అర్జీలకు పరిష్కారం లభించగా, 782 పెండింగ్‌లో ఉన్నాయి. అర్జీలను విభజించి ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తాం.

ప్ర: రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా ఏ సమస్యలపై అర్జీలు వచ్చాయి?

జ: ఆర్వోఆర్ 483, 22ఏ 197, ఎఫ్‌లైన్ 400, ఇళ్ల స్థలాలు 113, ఆక్రమణలు 19, ల్యాండ్‌గ్రాబింగ్‌పై 39 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను సంబంధిత సచివాలయ వీఆర్వోలు పరిష్కరించాలి. వీఆర్వోలు బాధ్యతగా వ్యవహరించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు.

ప్ర: ముదపాక ల్యాండ్ పూలింగ్ వివాదం మాటేంటి?

జ: ముదపాకలో రెవెన్యూ సదస్సులో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి 158 అర్జీలు అందాయి. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి భూ సమీకరణ లోతైన అధ్యయనం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతున్నది.

ప్ర: పౌర సేవల్లో జాప్యం జరిగితే తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: సిటిజన్ చార్టు ప్రకారం నిర్ణీత గడువులోగా సేవలు అందిస్తాం. పెండింగ్ ఉంటే క్షేత్ర స్థాయి సిబ్బందిని వివరణ కోరుతాం. జాప్యంలో తప్పిదం జరిగినట్టు తేలితే షోకాజ్ నోటీసు, మెమో ఇస్తున్నాం. పట్టదారు పాసుస్తకాలు, మ్యుటేషన్లు, ఇతర ధ్రువపత్రాలను పారదర్శకంగా జారీ చేస్తున్నాం, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా నన్ను నేరుగా సంప్రదించవచ్చు.

-పెందుర్తి, (ఆంధ్రజ్యోతి)

జాతీయ స్థాయి పరీక్షా పే చర్చ సదస్సుకు నడుపూరు స్కూల్

గాజువాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పరీక్షా పే చర్చకు నడుపూరు స్కూల్ ఎంపికైంది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన సదస్సులో పాఠశాల ఉపాధ్యాయుడు పి.నారాయణరావు, పదో తరగతి విద్యార్థి దిలీప్‌కుమార్ సాహూ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది పాఠశాలలు ఎంపిక కాగా, వీటిలో నడుపూరు స్కూల్ కూడా ఉంది. రాష్ట్ర స్థాయిపోటీల్లో వివిధ అంశాల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి చర్చకు ఎంపికైనట్టు హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు.

పెదమడకలో సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 85వ వార్డులో పెదమడక రామాలయం వద్ద గురువారం సీతారాముల పరస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరసను నిర్వహించారు. అలాగే కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలు, బొమ్మల కొలువులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే దిబ్బపాలెం రామాలయం వద్ద సాయంత్రం పరస ఉత్సవం జరిగింది.

రాంపురంలో...

పెందుర్తి: మండలంలో రాంపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మతల్లి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటాలు, చిడతలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నా, పెద్ద లేకుండా అందరూ కలిసి సందడి చేశారు.

వేపగుంటలో...

వేపగుంట: వేపగుంట పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం ముత్యాలమ్మ తల్లి పరస మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. పరస ఉత్సవాల్లో నిర్వహించిన భాగంగా బుర్రకథ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అగనంపూడిలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సేవా సమితి ఆర్థిక సాయంతో భక్తులకు, అనాథలు, యాచకులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజనలతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యనారాయణ, లీలావతి, పవన్, సత్యలక్ష్మి, పంకజం, సూరీడమ్మ, పద్మ, రాజు పాల్గొన్నారు.